# నాగావళి నవ్వింది

**నే**నో తిక్క వెధవనని చాలామంది అనుకుంటుంటారు. అనుకోనివ్వండి, నాకేం ఫర్వాలేదు. నేనందర్లాగా వుండననీ, అందర్లాగా ప్రవర్తించననీ నా మీద ఛార్జీ. ఈ ఛార్జీకి నేనేమీ బాధపడ్లేదు గాని -నన్ను కిల్‌జోయ్ (Kill-Joy) గా కొందరు ముద్ర వేసినప్పుడు మాత్రం నిజంగా బాధపడ్డాను. రామనాథం మేష్టారి అమ్మాయి ఎవరితోనో లేచిపోయిందని టీకొట్టు దగ్గర చేరిన మేష్టర్లంతా సరదాగా చెప్పుకుంటుంటే - "మన స్టాఫ్ మెంబర్‌కి వచ్చిన కష్టం మనకొచ్చిన కష్టం లాంటిదే. విచారించడానికి బదులుగా మీరంతా ఆ విషయాన్ని తలుచుకొని ఎలా నవ్వగలుగుతున్నారో నాకర్థం కావడం లేదు" అని నేను చాలా కఠినంగా నా అభిప్రాయాన్ని చెప్పేను. నా మాటల్ని విని అంతా ముఖముఖాలు చూసుకున్నారు. ఇలాటివే మరో రెండు మూడు చవకబారు సన్నివేశాల్ని పురస్కరించుకొని అంతా నవ్వుతుంటే, నేను వాళ్ళ నీచపు అభిరుచుల్నీ, పైశాచికానందాన్ని ఎండగట్టేను. అదిగో అప్పట్నుండే నన్ను కిల్‌జోయ్‌గా అభివర్ణిస్తూండేవారు. నన్ను తిక్కసన్నాసిగా జమకట్టడానికి దారితీసిన పరిస్థితులు కూడా యించుమించు యిలాటివే. నేను టీ తాగడానికి వచ్చిన వేళకి అక్కడ చేరిన లెక్చరర్స్ మధ్య ఏదో తీవ్రమయిన విషయం గూర్చి వాగ్యుద్ధం జరుగుతుండేది. వారి చర్చల్లో ఎందుకనో నాకు అవగాహన లోపం, మిడిమిడి జ్ఞానం కొట్టొచ్చినట్టు స్పష్టంగా కనిపించేవి. వాళ్ళని యేడిపించడానికి చర్చ జరుగుతున్న విషయం మీద మౌలికమైన ప్రశ్నల్ని లేవనెత్తేవాడ్ని. వాటికి సమాధానాలు యివ్వడం చాతకాక నా ప్రశ్నల్ని తిక్కప్రశ్నలుగా కొట్టిపారేసేవారు. ఈ విధంగా నన్నో తిక్కవాడిక్రిందా, కిల్‌జోయ్ క్రిందా జమచేసి నా కొలీగ్స్ నన్ను ఎవోయిడ్ చేస్తుండేవారు.

అయితే ఒక్కటే అదృష్టం నాతో పనిచేస్తున్న ఉపాధ్యాయులు నన్నుచూసి భయపడో, చికాకుపడో దూరంగా జరిగితే జరగవచ్చుగాక, కాని నా విద్యార్థులు మాత్రం నన్ను, నా కంపెనీని యెంతగానో యిష్టపడేవారు. "ఫిలాసఫీ అంటే ఏమిటి? మీరు ఎందుకు ఫిలాసఫీ చదువుదామనుకుంటున్నారు? జీవితంలో - అంటే మీరు పెద్దవాళ్ళయాక ఏవిటి చేస్తే బావుంటుందని మీ వుద్దేశం? అమ్మలు, నాన్నలు, తాతలు చెప్పినట్లే నడుచుకుంటారా, లేక మీకు నచ్చిన పద్ధతిలో నడుచుకుంటారా?" ఇలాంటి ప్రశ్నలతో నేను క్లాసులు తీస్కోడం

ప్రారంభించాను. అక్కడితో ఆగకుండా "క్లాసంటే నేనొక్కడ్నే వాగుతుండడం, మీరంతా ఆవులింతల్ని బలవంతంగా ఆవుకుంటూ, పాఠం వింటున్నట్టు నటించడం, ఉలుకూ పలుకు లేకుండా నిశ్శబ్దంగా కూర్చోడం యిలాంటివేం పనికిరావు. నా క్లాసులో అందరం - అంటే మీరు, నేనూ కూడా మాట్లాడుతూ వుండాలి" అని స్టూడెంట్స్‌ని హెచ్చరించీ, బుజ్జగించీ, ప్రోత్సహించీ మాటల్లోకి దింపేను. వాళ్ళు అడిగే ప్రశ్నలు, వాళ్లని నేను అడిగే ప్రశ్నలు, వస్తున్న సమాధానాలు, వాటి మీద వివరాలు - యిలా క్లాసులు చాలా లైవ్లీగా(lively) వుండేవి. ప్రొఫెసర్ శివ్.కె. కుమార్ (Professor Shiv K.Kumar) ఆశించినట్లుగా నా క్లాసులు తెలుసుకోడానికీ, తెలియపర్చడానికీ - నాకూ, విద్యార్థులకీ మధ్య ఓ రకంగా అభిమానంతోను, అవగాహనతోను కూడుకున్న నిత్య సంఘర్షణలా వుంటుంటాయి. నిత్యం కోలాహలంగా వుండడంతో నా కొలీగ్స్ వాటిని 'సంతలు' కింద జమచేస్తుంటారు. అవును మరి క్లాసులు నడిపే విధానంలో వాళ్ళకీ నాకూ చాలా తేడా వుంది. క్లాసులు శ్మశాన వాతావరణంలాగా నిశ్శబ్దంగా జరగాలనీ, విద్యార్థులు బొమ్మల్లా నోరు మూసుకొని వినాలనీ వాళ్ళ ఉద్దేశం. ప్రశ్నలు, సమాధానాలు అనే విధానంతో లెర్నింగ్ ప్రోసెస్ లో(Learning Process) ఉపాధ్యాయుడు విద్యార్థులూ భాగస్వాములు కావాలన్నది నా నమ్మకం.

అయితే మొదట్లో నాక్కొన్ని ఇబ్బందులు యెదురుకాక పోలేదు. ప్రశ్నించడం నేర్చుకోండయ్యా అని నేను అనగానే - తెల్లపోయి చూశారు విద్యార్థులు. ఒక విద్యార్థి కాబోలు మెల్లిగా ధైర్యం తెచ్చుకొని నిలబడి "అదేవిటిసార్ అలా అంటున్నారు? ఏ క్లాసులోనైనా నిజంగా అనుమానంవచ్చి ప్రశ్న వేసినా- ఏవిట్రా తలతిక్క ప్రశ్నలూ నువ్వూను, ఏం పరీక్షకి యీ సంవత్సరం కూర్చోవాలని లేదా?" అని కసిరో, భయపెట్టో మా నోర్లు మూయించేస్తారు మిగతా లెక్చరర్లు. మరి మీరేమో ప్రశ్నించడం మొదలెట్టండయ్యా అంటున్నారు. నిజంగానే మేమే ప్రశ్నలు అడగడం మొదలెడితే మీరు కోపం తెచ్చుకోకుండా సమాధానాలు చెప్తారా సార్?" అనడిగేడు.

అతనడిగిందీ సబవుగానే కనపడింది. ఏ కుర్రాడో లేచి ఏదో చిక్కుప్రశ్న వేస్తే - సమాధానం దొరక్క, ఉడుకుమోత్తనం వచ్చి కేకలు వేస్తానా? లేకపోతే నాకూ సమాధానం తెలియని ఆ ప్రశ్నకి సమాధానం తెల్సుకునే ఆ కుర్రాళ్ళకి చెప్తానా? చూడాలి - నిజంగా విద్యార్థులు ప్రశ్నలు వేసే సమయం రావాలి, అప్పుడు తేలాలి "నేనేమిటి, అలాటి పరిస్థితుల్లో నా రియాక్షన్ ఏమిటి' ' అన్నది. కుర్రాడి అనుమానాన్ని మెచ్చుకుంటూ తల ఆడించి, ఓ చిన్న నవ్వు నవ్వి యిలా అన్నాను. "అబ్బే! కోపం తెచ్చుకోనయ్యా! అలా కోపం తెచ్చుకునే వాడ్నయితే మిమ్మల్ని ప్రశ్నలు ఎందుకు వెయ్యమంటాను? మీకు సందేహం కలిగించే ఏ విషయం గురించేనా ధైర్యంగా ప్రశ్నలు వేస్తూ వుండండి. మీకు సమాధానం చెప్పలేక ఒకవేళ చికాకు పడ్డాననుకోండి, ప్రశ్నించమని పురెక్కించి, తీరా ప్రశ్న వేసేసరికి చికాకు పడతారే సార్ అని నన్ను నిలదియ్యండి!' ' అని వాళ్ళకి ధైర్యం ఇచ్చాను.

అదిగో అప్పట్నుంచీ రకరకాల విషయాల గురించి గమ్మత్తు గమ్మత్తయిన ప్రశ్నలు నా

మీదికి సంధిస్తూ వుండేవారు విద్యార్థులు. వాటితో కోపం, చికాకు వచ్చేస్తాయేమోనని భయపడ్డానా, కాని అలా ఏనాడూ జరగలేదు. మొదట్లో విద్యార్థులువేసే ప్రశ్నలు చాలా నాసిరకంగా వుండేవి. అలాటి చచ్చుప్రశ్నలక్కూడా చికాకు పడకుండా సమాధానాలు యిస్తూనే, క్రమేపి వాళ్ల ప్రశ్నల్ని, వాళ్ళు అడిగే విషయాల్ని వున్నత స్థాయికి మళ్ళించడానికి ప్రయత్నిస్తుండే వాడిని. నా ప్రయత్నం మంచి ఫలితాన్ని యిచ్చింది. పాఠం చెప్పడంలో నేను ప్రారంభించిన పద్ధతి విద్యార్థులకి ఎంతగానో నచ్చింది. దీనివల్ల నా క్లాసుల్లో జవ జీవాలు తొణికిసలాడుతుండేవి. క్లాసంటే నాకూ, విద్యార్థులకు కూడా ఒక ఆనంద హేలలాగ వుండేది. దాపరికంలేని ఆత్మీయత, స్నేహభావం మా మధ్య నెలకొంది. "విద్యా వ్యాపారం కార్చిచ్చులా అంతటా వ్యాపించేస్తున్న యీ రోజుల్లోకూడా యింకా "ఉపాధ్యాయుడు, విద్యార్థులు, వారి మధ్య సత్సంబంధాలు" అంటూ ఉటోపియన్ కబుర్లు(Utopian) చెప్తున్నాడు కదా ఈ ఫిలాసఫీ మేష్టరు కొంప తీసి వీడిగ్గాని మన చెవుల్లో పువ్వులు కనిపిస్తున్నాయేవిటి చెప్మా" అని తోటి మేష్టర్లు సరదాగా మాట్లాడుకోడం నాకు తెలుసు. పరిస్థితులు నిస్పృహ కలిగించేంత అధ్వాన్నంగా వున్నమాట వాస్తవమే. కాని నేనింకా ఆశని కోల్పోలేదంటే అందుక్కారణం నా విద్యార్థులు, నా క్లాసులు, మా మధ్యని నెలకొనివున్న ఆత్మీయతలే.

ఫిలాసఫీ గ్రూపులో సరిగ్గా పద్నాలుగు మంది విద్యార్థులే వుండేవారు పదిహేనోవాడు వేదాంత తత్వాన్ని ముందుగానే వంటబట్టేట్టు చేసుకుని వచ్చినట్టున్నాడు - ఈ చదువులు, ఈ కాలేజీలు, ఈ మేష్టార్లు అంతా మిధ్య అనేసి, కనపడకుండా పారిపోయాడు. ఫిలాసఫీ గ్రూపులో పదిహేనుమందికంటే ఎక్కువ మంది చేరడానికి వీల్లేదని అడ్డుతగిలేవాడు మా ప్రిన్సిపాల్. ఆయన దృష్టిలో సబ్జెక్ట్సు (Subjects) అంటే ఫిజికల్ సైన్సెస్, బయోలాజికల్ సైన్సెస్ మాత్రమే. మిగిలిన గ్రూపులన్నీ ఉత్త అల్లాటప్పా గ్రూపులని అతని నమ్మకం. అందులోనూ ఫిలాసఫీ, సోషియాలజీ, ఆంత్రోపాలజీ (Anthropology) గ్రూపుల్ని చూస్తే మరింత మంటగా వుండేది ఆయనకు. ఏ మహానుభావుడో కాలేజి తెరిచిన కొత్త రోజుల్లో ఈ కాలేజికి ప్రిన్సిపల్‌గా వచ్చి అన్ని రకాల అరుదైన గ్రూపుల్ని ప్రారంభించేడు. విజ్ఞానం వేయి దిశల్లో, వేయి రూపాల్లో వ్యాప్తి చెందాలని అభిలషించి వుంటాడు అతగాడు. ఆయన మహాసంకల్పం వల్ల ఎంతో మందికి ఆయా సబ్జెక్టుల్లో ఉద్యోగాలు దొరికాయి.

మరి ప్రస్తుతం ఈ కళాశాలని పాలిస్తున్న మహాప్రభువో? చెప్పేనుగా, అతనికి ఈ అరుదైన గ్రూపులన్నీ ఒట్టి పనికిమాలిన సబ్జెక్టుల్లా కనిపిస్తుంటాయని, అందుకే చీటికి మాటికీ సందుదొరికినా యీ గ్రూపుల్ని ఉత్తి సన్నాసి గ్రూపులుగా చిత్రించడం మానడు. మొట్టమొదటి అవకాశంలో ఈ పనికిరాని గ్రూపుల్ని మూయించేస్తానని బాహాటంగా ప్రకటిస్తూ వుంటాడు. పాపం అతని బెదిరింపులకి భయపడి ఆంత్రోపాలజీ, సోషియాలజీ లెక్చరర్లు ఎక్కడ ఉద్యోగాలు వూడి వీధుల్లో పడతామోనని నిత్యం దిగులుపడి చస్తుంటారు. ఆ భయంవల్లనేనేమో, వాళ్ళుపాపం అవకాశం దొరికినప్పుడల్లా ప్రిన్సిపాల్‌గారికి భజనచేస్తూ వుంటారు. ప్రిన్సిపాల్‌గారి బెదిరింపులకు

ఏమాత్రం చలించకుండా, నిమ్మకు నీరెత్తినట్టుతిరుగుతున్నానని కాబోలు - నన్ను చూస్తే మరీ గుర్రుగా వుండేది అతగాడికీ.

ఇంతకీ చెప్పొచ్చేదేవిటంటే, ప్రిన్సిపల్‌గారు విధించిన పరిమితులవల్ల మా ఫిలాసఫీ గ్రూపులో కేవలం పధ్నాలుగుమందే వున్నారు. అయితే, పధ్నాలుగు మందితో క్లాసు ఎంత బాగానో వుంటుంది. క్లాసు చిన్నదైతే, ఎక్కడేనా - ఏ చెట్టుకిందేనా - పాఠం చెప్పుకోవచ్చు - శాంతినికేతన్‌లో లా. 'పధ్నాలుగు మంది కోసం పెద్ద పెద్ద గదులిచ్చేస్తే ఎలాగండీ' అని నా సబ్జెక్ట్ కోసం ముట్టకొట్టులాంటి చిన్న గదిని కేటాయించేవాడు మా టి.టి.ఎం. (T.T.M.). అంటే టైమ్ టేబుల్ మేకర్‌గా పిలవబడే మేథ్స్ హెడ్. అతగాడికెందుకో నన్నుచూస్తే గుర్రుగా వుండేది. నేనతన్ని అల్లరి పెట్టాలని చూస్తున్నాననే భావన అతన్నెందుకో బాగా పట్టేసింది. కాని అది అబద్ధం , నిజానికి అతన్ని చూస్తే నాకు జాలివేసేది. మనిషి వ్యసనాలకి దాసుడు. వేలకి వేలు జీతం పుచ్చుకుంటూ, బికారివాడిలా కనిపించేవాడు. సీనియర్ లెక్చరర్‌గారి పిల్లలన్న పేరేగాని, ఆప్యాయతలకి నోచుకోని వాళ్ళలా దీనంగా కనిపించేవారు అతని పిల్లలు. పైగా తండ్రీ బిడ్డలూ ఎప్పుడూ ఎడమొహం పెడమొహంగా వుండేవారు.

అతనెలా ఏడిస్తే నాకేంగాని, అతనికొడుకు నా ఫిలాసఫీ గ్రూపులో వుండడంతో అతని గురించి ఆసక్తి కనపరచకుండా వుండలేకపోయాను. కుర్రాడు నా గురించి యింటిదగ్గర ఏం చెప్పేడో నాకు తెలీదుగాని, మేథ్స్‌హెడ్ మాత్రం నామీద ఎందుకో కోపం పెంచుకున్నాడు. అతగాడే తిన్నగా ప్రిన్సిపల్ దగ్గరకి వెళ్ళి, నేనెప్పుడూ క్లాసులో పాఠాలు చెప్పననీ, అడ్డమైన ప్రశ్నలు అడగమని చనువిచ్చి కుర్రాళ్ళని నెత్తికెక్కించుకుంటున్నాననీ. నా గ్రూపులో చేరిన కుర్రాళ్ళంతా ఉత్తవనికిరాని వెధవల క్రింద తయారవుతున్నారనీ, నావల్ల ఇండిసిప్లిన్(Indiscipline) కాలేజిలో పెచ్చుపెరిగే ప్రమాదం ముంచుకొస్తున్నాదనీ చెప్పేడట. ఆయన ఈ భోగట్టాలని ప్రిన్సిపల్‌గారి చెవిలో వేస్తుండగా, ఫిజికల్ డైరక్టర్‌గారు అక్కడేవుండి అంతా విన్నారట. ప్రిన్సిపల్‌గారి ఎదురుగా కుర్చీలో బైఠాయించి నిత్యం ఆయనకి కాకాపడుతుండడం మినహా వేరే పనేంలేదు, ఫిజికల్ డైరెక్టర్‌గారికి. అసలు విద్యార్థులకే స్పోర్ట్స్ అండ్ గేమ్స్‌లో ఆసక్తి తగ్గిందో, లేక యితగాడికే వాటిని సరిగ్గా కండక్ట్ (Conduct) చెయ్యటం చేతకాదో తెలీదుగాని ఇతగాడు కాలేజికి ట్రాన్స్‌ఫర్ అయి వచ్చిందగ్గర్నుండీ, కాలేజీలో స్పోర్ట్స్అండ్ గేమ్స్ యాక్టివిటీ అనేది మచ్చుకి కూడా కనపడకుండా పోయింది. విశాలమైన కాలేజి ఆటస్థలాలు పశువుల మందల మేతకి వుపయోగపడుతున్నాయి. క్రీడాచార్యులవారికి మరేపనీ లేకపోవడంవల్ల కాబోలు, నిత్యం ఆయన ప్రిన్సిపాల్ గారి సమక్షంలోనే ఆశీనుడై వుంటాడు. అక్కడితో ఆగకుండా, ఆఫీసులో జరుగుతున్న సమస్త వ్యవహారాలనీ, అక్కడా యిక్కడా చెప్పి, యధాశక్తి పిలకలు ముళ్ళుపడేట్టు చూస్తుంటాడు. ఇదిగో ఇతనే ప్రిన్సిపల్‌గారితో నా గురించి మేథ్స్ హెడ్ చెప్పిన విషయాలన్నిటినీ నాలుగు చిలవలు పలవలు కలిపించి మరీ నాతో చెప్పేడు. అతని అంచనా ప్రకారం నేను తిన్నగా మేథ్స్

కథా నిలయం
671



హెడ్ దగ్గరకి వెళ్ళి అతని జుట్టు పట్టుకుని తగూకి దిగాలి. వ్యాయామ కార్యక్రమాలు కాలేజిలో ఎలాగూ లేవు కనక, కనీసం లెక్చరర్లు జట్లు, జట్లు పట్టుకోవడం, మల్ల యుద్ధంలోకి దిగడం లాంటి కార్యక్రమాలేనా చేస్తే అదే వ్యాయామ విద్యగా భావించి సంతోషిస్తాడేమో పి.డి.! అయితే అతడు ఆశించిన ప్రోత్సాహక చర్య నా పక్కనుండి దొరకలేదు. అతను చెప్పనవి విని , వూరకనే నవ్వేసి బాబులుగాడి టీ షెడ్ వైపు వెళ్ళి పోయాను. ఎంతలా వురెక్కించినా తగూకి దిగకపోవడం కూడా నా తిక్క బుద్ధికి తార్కాణంగా కనిపించి వుంటుంది అతగాడికి.

కాలేజికి వచ్చి మేమంతా దమ్మిడీ 'ఎత్తు పనికూడా చెయ్యకుండా కూర్చుంటున్నామేమో, మరి మాకు ఏదైనా కాలక్షేపం వుండాలి కాదా టైము గడపడానికి! అదిగో అలా మాకు టైమ్‌పాస్ కావడానికి కాలేజి కేంపస్‌లో ఓఅనువైన జాగాలో కేంటీన్ తెరిచాడు-మాంచి ఎంటర్‌ప్రయిజింగ్ నేచర్‌వున్న చాకులాంటి కుర్రాడొకడు. కేంటీన్ పెట్టుకోడానికి ఆ కుర్రాడు పర్మిషన్ అడిగీ అడగ్గానే ప్రిన్సిపల్‌గారు సరే అన్నారట. వెంటనే దీని వెనకాల ఏదైనా కథ వుందా అని అనుమానం వచ్చింది నాకు. ఏ పనికోసం వెళ్ళినా సరే " నో" అనే జవాబు తప్ప మరోకటి వుండదు అతగాడి దగ్గర. అలాటిది కేంటను పెట్టుకోడానికి , అడిగిన వెంటనే పర్మిషన్ యిచ్చేడంటే - చూశారూ, యిలాటి సందేహాలు నాకొస్తుంటాయి. కనుకనే బహుశా నన్ను వింత మనిషిగా అంతా ముద్రవేశారు.

కొన్నాళ్ళు పోయాక నా అనుమానం సరయిందేనని రుజువయింది. ప్రిన్సిపల్‌గారి పుత్రరత్నం ద్వారా కేంటీన్ కొట్టువాడు పని సాధించేడని (P.D.) పి.డి. గారు అడిగినవారికి , అడగని వారికి కూడా చెవుల్లో వూదడం మెదలెట్టేడు. ప్రిన్సిపల్‌గారు తనో పెద్దపులిలా కనిపించాలని సర్వదా ప్రయత్నిస్తూ వుంటారు. ఎవరు అతతనిలో పనివుండి వచ్చినా , గభీమని బిగుసుకుపోయి, గజంబద్ద మింగిన మనిషిలాగ నిటారుగా అయిపోయి, అసహజమైన గొంతుకతో మాట్లాడి తన గాంభీర్యాన్ని ప్రదర్శించాలని చూస్తూ వుంటాడు. అయితే యింతటి ధీర గంభీరుడున్నూ, కొడుకు దగ్గర మాత్రం పిల్లిలా ప్రవర్తిస్తాడట. వాడో రౌడీ అంటుంటారు మా వాళ్ళు . కానీ నాకు మాత్రం అలా అనిపించేది కాదు. తండ్రి గాంభీర్య ప్రదర్శన వెనక పిరికితనం నక్కి వున్నట్లే వీడి దురుసుతనం వెనకాతల ఏదో అణకువతనం, మంచి తనం పొంచి వున్నట్లు కనిపెట్టాన్నేను.

టీకొట్టు అనబడే కేంటీన్ తెరచిన బాబులుగాడు మొదట్లో ఏకులా మెత్తగా వుండి, నంగిరోడుతూ, నక్క వినయాలు ప్రద ర్శిస్తూ వుండేవాడు. కాని క్రమేపి మేకులా తయారయాడు. దానిక్కారణం మా టీచర్సే. మేథ్స్ హెడ్‌గారు, కామర్స్ హెడ్ పిచ్చయ్యగారూ, ఫిజిక్స్ లెక్చరర్ రమణగారు వ్యసనపరులని వీడు పసిగట్టేడు. ఇంకేముంది - వాళ్ళకి కావాలసిన సదుపాయాలు అమర్చిపెట్టే బాధ్యత వీడు తీసుకున్నాడు. వాళ్ల ప్రాపకం దొరగ్గానే ఇక నాకు తిరుగులేదనే భరోసా వాడికొచ్చేసింది.

టీ తాగడానికి ఒకే సమయంలో వచ్చి నేనూ, మేథ్స్ హెడ్‌గారూ ఒకరి కొకరం తారసపడిపోయేం, మనసులో ఎలాంటి భావాలు వున్నా ,వాట్ని బయిటికి కనపడనివ్వకుండా , మొఖానికి చిరునవ్వు

ముసుగు తగిలించుకొని 'హలో అంటే హలో' అనుకోవడం జరిగిపోయింది. " సార్ కో మంచి టీ తయారు చెయ్యిరా బాబులూ! "అని ఆర్డరు వేశారు మేథ్స్ హెడ్‌గారూ. టీ వొచ్చింది. నిజంగానే టీ చాలా బావుంది. చప్పరిస్తూ తీరుబడిగా టీని సేవిస్తున్నాం. ఏటిగాలి శరీరాల్ని సేదదీరుస్తోంది. వున్నట్టుండి గభీమని "మేష్టారూ, ఏవిటి బొత్తిగా అర్థం లేని ప్రశ్నలువేసే స్థితికి తెచ్చేరు కుర్రాళ్లని ? " అన్నారు మేథ్స్‌హెడ్. ప్రశ్న హఠాత్తుగా వచ్చిందేమో, దాని సారాంశం నా బుర్రాలో ఇంకడానికి కొద్ది క్షణాలు పట్టింది. ప్రశ్న అడిగిన తీరు కోపం తెప్పిస్తున్నా, చిరునవ్వుని బలవంతంగా ముఖానికి అద్దుకుని " మీరు కాస్త వివరంగా చెప్పగలిగితే, బహూశా మీకు సమాధానం చెప్పగలననుకుంటాను" అన్నాను.

" మా క్రురాడున్నాడు కదా మీ గ్రూపులో !" అని అగేడు. ఆగి గట్టిగా సిగరేట్ దమ్ము లాగేడు. చెప్పాలని వున్నా, చెప్పలేక సతమతమవుతున్న అతని మనస్థితి పసిగట్టేశాను. కొడుకేదో చికాకుపెట్టే ప్రశ్న వేశాడన్న మాట!

" ఆదే మొన్న మా కుర్రాడు ఇంట్లో నలుగురం కూర్చుని భోంచేస్తుంటే, అడిగేడు, " నాన్నా మనం ఎందుకిలా బతుకుతున్నామో, ఎందుకిలా బతకాలో మీరు చెప్పగలరా" అని చాలా సీరియస్‌గా. అసలే నాకావేళ గొప్ప చికాగ్గా వుంది. కురుపు మీద కారం జల్లినట్టు వీడి ప్రశ్నలు. చాచి లెంపకాయ వేద్దామనుకున్నాను. కాని ఫైనల్ బియ్యే చదువుతున్న కొడుకు మీద చెయ్యి చేసుకుంటే ... పైగా మీ సారధ్యంలో తయారవుతున్న కుర్రాడాయె. తిరగబడితే పోయేది నా పరువే. అందుకే ఆమాయించుకున్నాను.అయితే నేనూ వూరుకోలేదులెండి అక్కడితో ' ఇలాటి చవట ప్రశ్నలు మీ ఫిలాసఫీ మేష్టారున్నారు కదా , ఆయన్నడుగు, మంచి సమాధానాలు చెప్తారు' అని వాడి ప్రశ్నని తిప్పికొట్టేను. ఇప్పుడు చెప్పండి - కుర్రాళ్లు ఎందుకిలాంటి ప్రశ్నలు వేస్తున్నారు? ఇది మీ ట్రయినింగ్ ఫలితం కాదా ? " అడగవలసింది బాగా ఉద్రేకపడుతూ అడిగేడు మేథ్స్‌హెడ్.

అతని ఉద్రేకం కాస్త తగ్గేక సమాధానం చెప్దామని, ఆలోచన నటిస్తూ వూరుకున్నాను. ఇంతలో పి.డి. అక్కడికి వచ్చేడు. మేం ఘర్షణ పడుతున్నాం దేనిగురించో అని దూరం నుంచే పసిగట్టి , వేటకుక్కలా పరిగేత్తుకొచ్చేడు - తమాషా చూద్దామని, తమాషా చూస్తున్నట్టు కనిపిస్తున్న అతని ముఖం చూడగానే నా నిర్ణయం జరిగిపోయింది.

తమాషా తిలకించడానికి గాని, కథలు చెప్పడానికి గాని అతగాడికి నేనవకాశం యివ్వను.అంచేత అక్కడ్నుండి లేచిపోతూ, చాలా మృదువుగా "కాసేపు తీరిగ్గా కూర్చుని మీ వాడు వేసిన ప్రశ్నకి సమాధానం ఆలోచించ కూడదూ? పోనీ, యిదీ ఒక ప్రోబ్లమ్ అనుకొని సాల్వ్ చెయ్యడానికి ప్రయత్నించండి!" అనేసి, నాగావళి వైపు గబగబ వెళ్లిపోయేను. కాలేజి పక్కనుండే ప్రవహిస్తుంది నాగావళి. MOBY DICK లో ఇస్మాయిల్ లాగ - మనస్సు మరీ చంచలమైపోతున్నప్పుడు - నాగావళి వడ్డుకిపోతే వూరట లభించినట్టు అనిపిస్తుంది.

"Time present and time past

Are both perhaps present in time future" అంటాడు T.S.Eliot. ఎలియట్ వూహలకి ప్రతీకగా నదికంటె వేరొకటి ఏదైనా వుంటుందా? ఏకకాలంలో భూత, భవిష్యత్, వర్తమాన కాలాల్ని ప్రత్యక్షంగా దర్శించగలిగే స్థితి ఒక్కనదిలోనేకదా కనిపించేది!

కాలేజిని ఆనుకునివున్న యీయేటివడ్డంతా శ్మశానంగా వుపయోగపడుతుంటుంది. ఆలోచిస్తుంటే అంతాగమ్మత్తుగా అనిపిస్తుంటుంది. ప్రవహించే యీనది జ్ఞానవాహిని అయిన కాలేజికి ప్రతీక అనుకుంటే యీ మరుభూమి కాలేజీల్లో విస్తరిస్తున్న నిర్జీవ వాతావరణానికి సూచిక కాదా? బావున్నాయి ఆలోచన్లు, చాలాబావున్నాయి!

నేనూ ఏటివడ్డుకి వచ్చేటప్పటికి యించుమించు ఆరిపోతున్న చితి దర్శనమిచ్చింది. దాన్నుండి దృష్టిని తప్పించి ఏటివైపు చూస్తే - ఏమీ పట్టనట్టు వుదాసీనంగా, హుందాగా సముద్రం దిశగా వెళ్లిపోతోంది. ఇంతకంటే ఏంకావాలి నిదర్శనం, జీవితం నిత్యమూ సత్యమూ అని ఓ పక్కనుండీ, అనిత్యమూ, అసత్యము అని మరో పక్కనుండీ అనిపించడానికి?

అలా యెంతసేపు ఆలోచిస్తూ కూర్చున్నానో తెలీలేదు, కాలేజి ఎటెండర్ నారాయణ వచ్చి పిలిచేవరకూ. కాలేజిలో పనిచేస్తున్న వాళ్లందర్లోకి, అతగాడ్ని చూస్తేనే అందరికీ ఒక రకమైన గౌరవభావం చేసేది ఎటెండర్ వుద్యోగమేకావచ్చు - కానీ ఎంతనిండుగా, ఎంత గంభీరంగా వుంటాడు! ముఖం మీద ఎప్పుడూ చెరిగిపోని చిరునవ్వు, దృష్టికందనిదేన్నో దర్శించాలని చూస్తున్నట్టునిపించే కళ్లు, నలుగురికీ వినిపించేంత గట్టిగా ఏనాడూ మాట్లాడని స్వభావం. నిత్యం కయ్ కయ్ మనే ప్రిన్సిపల్, యీ యెటెండర్ ముందు విదూషక పాత్రలా అనిపిస్తూవుంటాడు.

"అయ్యగారు పిలుస్తున్నార్ సార్" అన్నాడు.

"నేనిక్కడుంటానని నీకెలా తెల్సింది నారాయణా?"

నవ్వేశాడు. ఆ నవ్వులో మిమ్మల్ని పూర్తిగా తెల్సుకున్నానైండి అనే సూచనా? మాట్లాడడు - ఏనాడూ మాట్లాడడు - అవసరాన్ని మించి ఒక్కముక్క కూడా. మన వుద్దేశాల్ని ఏనాడూ సరిగ్గా చెప్పలేదు యీ భాష అనికదూ నీచే (Nietzsehe) అంటాడు? నారాయణ కూడా అలాగే అనుకుంటున్నాడా? లేకపోతే అంత ముక్తసరిగా ఎందుకు వాడతాడు మాటల్ని? కాలేజి పోర్టికో దగ్గరకి వచ్చేసరికి మేథ్స్‌హెడ్‌గారి అబ్బాయి సుధాకర్ కనిపించేడు. అన్నీ పోగొట్టుకున్నా, జీవితపు అగాధంలో యింకా దేనికోసమో అన్వేషిస్తున్నవాడిలా కనిపించే ఆకుర్రాడంటే నాకు చాలా యిష్టం.

'మీ కోసమే చూస్తున్నాను సార్' అన్నాడు సుధాకర్.

'ఏమిటి కథ?' అన్నాను కుర్రాడి భుజంమీద చెయ్యివేస్తూ! ఇంతలో పాలిటెక్స్ లెక్చరర్ మురళీ మోహన్ మా యిద్దరి వైపూ కొరకొర చూస్తూ టీకొట్టు వైపు వెళ్లిపోయాడు. నేను స్టూడెంట్స్‌ని మరీ ముద్దుచేసి నెత్తికెక్కించుకుంటున్నానని భావించే వాళ్లలో అతగాడొకడు.

విద్యార్థి ఏ పనిమీదన్నా, అతగాడి దగ్గరకి వెళ్తే ఎక్కడలేని దర్పం ప్రదర్శిస్తాడు. గొంతుకలో బోధకుడి లక్షణాలు వచ్చేస్తాయి. అయితే యింతటి గొప్ప వ్యక్తి, ఒక్క పెగ్గు విస్కీ పడగానే వేసే చిందులు, కూసే కూతలు చూసి, విని తీరవలసిందే అంటుంటారు అతని మందు మిత్రులు.

ఏవిటి కథని నేనువేసిన ప్రశ్నకి సంకోచిస్తూ, బిడియపడుతూ, "నేను చదువు మానేయాలనుకుంటున్నాన్సార్" అని సమాధానం యిచ్చేడు సుధాకర్. నా తల మీద ఆకాశం కూలినట్టనిపించింది. ఎలానమ్మేది సుధాకర్ మాటల్ని? ఆశ్చర్యం, నమ్మలేని భావం, అలాటిది జరగడానికి అవకాశంలేదనే నిశ్చయం - యివన్నీ నా ముఖంలోకి వచ్చి చేరుకుంటున్నాయి. ఎంతో ప్రయత్నంమీద 'ఎందుకని?' అనడిగేను. అయితే జవాబు చెప్పడానికి వాడినోరుపెగల్లేదు. కళ్లు వర్షించడానికి సిద్ధంగా వున్న కారు మబ్బుల్లా వున్నాయి. రెట్టించి అడిగితే, పోర్టికోలోనే భోరుమని ఏడ్చేస్తాడేమోననే భయంవేసింది. నలుగురి ముందు భోరుమని ఏడవడం నాకు చాలా సిగ్గనిపిస్తుంది. హెమింగ్వే ('Hemingway) హీరో (Santiago) యీ విషయంలో నాకా దర్శం. జీవితంలో ఏదికోల్పోయినా ఫర్వాలేదు - మనిషి తన డిగ్నిటీని మాత్రం కోల్పోకూడదు. నలుగురిముందు ఏడవడమంటే - మనిషి తన బేలతనాన్ని చాటుకోవడమే అని నా నమ్మకం.

కుర్రాడి వుద్రేకం తగ్గించి, కాస్త స్థిమిత పడేట్టు చెయ్యడం నా మొదటి బాధ్యత అనిపించింది. అందుకని సుధాకర్ వీపుమీద వూరడింపుగా తడుతూ "కాసేపు వెయిట్ చెయ్యకూడదూ, తీరిగ్గా మాట్లాడుకుందాం ప్రిన్సిపల్‌గారు ఎందుకోపిల్చేరట - వెళ్లొచ్చేస్తాను. అయిదు నిముషాల్లో - వుంటావు కదూ! "అని, గబగబ మెట్లెక్కిపోయాను. కుర్రాడు కనిపించిన తీరు, చెప్పిన సంగతే నన్ను బాగా కుదిపివేశాయి. చిందర వందర అయిన మనస్సుతో నేను ప్రిన్సిపల్‌గారి గదిలోకి ప్రవేశించేను.

అక్కడకి వెళ్ళాక తెలిసింది.అర్జెంటుగా స్టాఫ్ కౌన్సిల్ మీటింగుని ఏర్పాటు చేసారని. కోర్సుల కవరేజిగురించి విద్యాశాఖ కమీషనర్ దగ్గర్నుండి అర్జంట్ లెటర్.

నిత్యం మేకపోతు గాంభీర్యంతొ కనిపించే ప్రిన్సిపల్‌గారు కమీషనర్ ఆఫీసు నుంచి ఎదైనా కాగితం వస్తేచాలు - అదేదో ఉరితీత ఆర్డరు లాగ భయపడిపోయి గజ,గజ వణికిపోతుంటాడు. ఆయన తెచ్చిపెట్టుకున్న గాంభీర్యం గాల్లో కోట్టుకు పోయి, పిరికి మొహంతో కనిపిస్తాడు .ఆ మొహంచూడగానే గోల్లున నవ్వాలపిస్తుంది నాకు. కాని బాగుండదుకదా అలానవ్వితే!

" కోర్సులు పూర్తయి రివిజనుజరుగుతోందా,లెదా ?" అదీసర్కులర్ సారాంశం. రెండోటర్మ్ ముగియడానికి ఇంకా పదిహేను రోజులు టైముంది. అతర్వాత మూడోటర్మ్ వుండనేవుంది. అలాంటప్పుడు ఇంత వేగంగా కోర్సులు పూర్తిచేశారా లేదా అనే ప్రశ్న అసహజంగా కనిపిస్తుంది ఎవరికైనా! పైగా రివిజన్ కూడానట! ఎమిటీ అసందర్భపు సర్కులర్లు?

అయితే అంతకంటే అసందర్భంగానూ, తమాషాగానూజరుగుతోంది మీటింగు. అన్ని డిపార్ట్‌మెంట్ల హెడ్స్ ఒకరితోఒకరు పోటీపడి మరీ ఆతృతగా చెప్పేస్తున్నారు, ప్రిన్సిపాల్‌తో, తమ తమ సబ్జెక్టుల్లో కోర్సులు పూర్తయిపోయాయని రివిజనుకూడా మొదలు పెట్టేశామని! వోరల్‌గా చెప్పడం అయినాక, లిఖితపూర్వకంగా అదే విషయాన్ని రిపోర్టు రూపంలో ప్రిన్సిపల్‌గారికి సమర్పించుకుంటున్నారు. ఈ తతంగం చూస్తుంటే, నిజంగా నవ్వాలో, ఏడవాలో అర్థంకాలేదు నాకు ఏవిటీ హిపోక్రసీ? ఎందుకీ అబద్ధపు బతుకులు? అందరూ భళీ, భళీ అంటుంటే ప్రిన్సిపల్ మొహంమీద గొప్ప విజయం సాధించినవాడిలా చిరునవ్వు!

ప్రొసీడింగ్స్ (Proceedings) నోట్ చేస్తున్న మేథ్స్‌హెడ్ రాయడం ఆపి సడన్‌గా నా మీదకి మళ్లించేడు దాడి. " తత్వశాస్త్రవేత్తలు వారి సిలబస్ కవరేజి గురించి ఇంకా ఏమీ శలవివ్వలేదే!" అని. జరుగుతున్న తతంగంతో విసిగిపోతున్న నామనస్సు ఎదురుదాడికి దిగమని బుస్సునలేచింది. దురుసుగా కర్కశంగా జవాబిచ్చేను. " మేథమేటిక్స్‌చాలా లాజికల్ సబ్జెక్ట్ అంటారు. అలాటి మెథ్స్‌శాఖకి అధ్యక్షత వహిస్తున్న తమరు ఇల్లాజికల్ (Illogical) గా మాట్లాడ్డం విచారకరం. ముందుగా - నేను తత్వశాస్త్రవేత్తను కానని, అధ్యాపకుడ్ని మాత్రమేనని మీరు గ్రహించాలి. పోతే నా సిలబస్ కవరయిందా అని కదూ మీ ప్రశ్న? ఇంకా కాలేదు."

మేథ్స్ హెడ్‌ని నేనేదో snub చేసినట్టనిపించిందేమో - చాలామంది ముసిముసి నవ్వులు నవ్వుకోడం, కొందరు ఎక్కడ తమ నవ్వులు ప్రిన్సిపాల్ కళ్ల బడిపోతాయోననే భయంతో మూతులకి చేతులు అడ్డుపెట్టుకోడం జరిగింది. అయితే నా సమాధానం, సమాధానం ఇచ్చిన తీరు, అందరూ ముసిముసి నవ్వులు నవ్వుకోడం, ఇవేవీ ప్రిన్సిపల్ దృష్టిని దాటిపోలేదు. అసలే నిత్యం చిరుబురులాడే అతన్ని నా వెటకార ధోరణి బాగా కవ్వించింది. దాంతో ఒంటికాలుమీద లేచేడు. " ఏమిటి - మాష్టారూ - ఇంతమందిలో సిలబస్ కవర్ కాలేదని మీరొక్కరే చెప్తున్నారు? పైగా అదేదో ఘనకార్యంలాగ విట్లు, వ్యంగ్యాలు, వివరణలు ఇచ్చి సీరియస్ అసెంబ్లీని నవ్వుతాలు క్రింద మార్చాలని చూస్తున్నారు - మీకిదంతా తమాషాలాగ కనిపిస్తోందా?" అనడిగేడు కళ్లెర్రచేసి. నేనూ వెనకాడలేదు సమాధానం చెప్పడానికి.

"కరక్ట్‌గా చెప్పారు సార్ - నిజంగా ఇదంతా గొప్ప తమాషాలాగే కనిపిస్తోంది నాకు. ఇక్కడ సమావేశమైన ఇంతమంది సీనియర్ టీచర్లు జంకు, గొంకు లేకుండా, సిలబసు కవరయిపోయిందని బుకాయిస్తుంటే, నాలాటి వాడు నవ్వడం మినహా చెయ్యగలిగిందేవుందంటారు?"

"You are impertinent| ఎవరితో మాట్లాడుతున్నారో, ఏవిటి మాట్లాడుతున్నారో మీకు తెలుస్తోందా?'

" పూర్తిగా తెలిసే మాట్లాడుతున్నాన్సార్ ! మీ ప్రధాన సలహాదారుల మాదిరి తీర్థం సేవించడం ఇంకా మొదలు పెట్టలేదు నేను. అంచేత తెలివిలో వుండే మాట్లాడుతున్నాను. ఇంతమంది పెద్దలు కోర్సులు అయిపోయాయని బుకాయిస్తుంటే...'

"Weprotest | Your are insulting us | Withdraw that word" అని పెనుకేక వేశాడు మేథ్స్ హెడ్.

"అవును, విత్‌డ్రా చేస్కోవాలి" మిగిలిన వాళ్ల కోరస్. కేకలు, చికాకులు కాస్త సద్దుమణిగాక లేచి నిలబడ్డాను. నిలబడి " మీరంతా కలిసికట్టుగా అరిచినంత మాత్రాన బెదిరిపోయి నేను క్షమాపణ చెప్పుకోడమో, నా మాటల్ని విత్‌డ్రా చేసుకోడమో చేస్తానని భావించకండి. కోర్సులు పూర్తయాయని మీరుబుకాయిస్తున్నారని కదా నేనన్నది -ఆమాట మీదే నిలబడతాను. ఈ విద్యా సంవత్సరంలో ఇప్పటివరకూ కేవలం ఏభై అంటే యాభై రోజులు మాత్రమే పనిచేశాం. నూట ఏభై రోజులు చెప్పినా పూర్తిగాని సిలబస్ కేవలం యాభై రోజుల్లోనే కవర్ చేశాం అని మీరంతా చెప్తున్నారు కదా - ఇది అసందర్భంగా అనిపించడంలేదా?"

"మీలాటివాళ్లకి అది అసందర్భంగానే అనిపిస్తుంది. క్లాసులో ఏనాడేనా పాఠం జరిగితేకదా యాభై రోజుల్లో కోర్సులు అవుతాయో లేదో కంపేర్ చేసి చూస్కో డానికి! కుర్రవాళ్ల తలతిక్క ప్రశ్నలు, అయ్యవారి అయోమయం సమాధానాలు - ఈ సంతగోలతోనే సరిపోతుందాయె సంవత్సరమల్లా మరి కోర్సులెలా అయి చస్తాయి!" అని తన అక్కసంతా వెళ్లగక్కేడు మేథ్స్‌హెడ్ . ఇహ ఇంత దాకా వచ్చాక నేనెందుకు వెనకాడాలి! మాటకి మాటకి అప్పచెప్పితీరవలసిందే!

" అయ్యా గణితాచార్యులవారూ, నోరు పారేసుకోడం మీకే కాదు - నాకూ చేతనవును. బొత్తిగా ఏనాడూ క్లాసులు జరక్కపోవడంకంటే, నంతగోలతో నేనా, క్లాసులు జరగడంమెరుక్కాదూ? చవట ప్రశ్నలు చచ్చుసమాధానాలూ అని ఎద్దేవా చెయ్యడానికి దిగేరు - అసలు ఏనాడేనా స్టూడుంట్స్ తమ డౌట్స్ (doubts) ఎక్స్‌ప్రెస్ చెయ్యడానికి అవకాశం ఇచ్చేరా? బోధనా పద్ధతిలో Socratic Method అని ఒకటి వుందని తెలుసునా తమరికి? ముందది సెలవివ్వండి!"

ప్రిన్సిపల్ తన లెఫ్టినెంట్ మీద ఈగ వాలడం కూడా సహించలేడు. అలాంటిది నేను, అతగాడ్ని నువ్వెంతంటే నువ్వెంతనడం చూసి గంగవెర్రులెత్తిపోయాడు. " ప్రిన్సిపల్‌కి, సీనియర్ టీచర్స్‌కీ ఇవ్వవలసిన రెస్పెక్ట్ ఇవ్వకుండా Most Impertinent tone లో సమాదానాలు చెప్తున్నారు. This amounts to gross insubordination మీ కాండక్ట్ గురించి వెంటనే కమిషనర్‌కి రిపోర్ట్ చేస్తాను" అన్నాడు నిప్పులుకక్కుతూ.

"తప్పకుండా చెయ్యండి సార్! కానీ స్టాఫ్‌కౌన్సిల్‌లో కూడా ఫ్రీ డిస్కషన్‌కి, డెమక్రటిక్ ఫంక్షనింగ్‌కి అవకాశంలేకుండాచేసి నియంతలాగ మీరు ప్రవర్తిస్తున్నారని నేనూ రాస్తాను కమీషనర్‌కి. టీచింగ్ మెథడాలజీ గురించి నేను వివరణ ఇవ్వాలనుకుంటుంటే మీరు అడ్డుతగిలి ఎకడమిక్ ఎట్మాస్ఫియర్ కాలేజిలో లేకుండా చేస్తున్నారని ప్రెస్‌లో స్టేటమెంట్ ఇస్తాను."

"హౌడేర్‌యూ....... " అంటూకోపంతో వూగిపోతూ,ప్రిన్సిపాల్ నామీదకి దూకబోయినంత పనిచేసాడు.

"మేష్టారూ, మేష్టారూ తమరు కొంచెం శాంతం వహించాలి. తమరు పెద్దవారు, ఫిలాసఫీమేష్టారు ఇంకా యూనివర్సిటీ వాసనలేనా పోని కుర్రాడు. అతగాడు సర్వీస్‌కీ, జీవితానికీ కూడా ఇంకా కొత్త. అతనేం చేసినా చెల్లుతుంది, చిన్నవాడు కాబట్టి. పెద్దవారు తమరు ఓర్మి వహించకపోతే - వచ్చేనింద తమదే అవుతుంది. అంచేత నా మనవి...." హిస్టరీ హెడ్ పల్లవి. మంటని మరికాస్త ఎగసన తొయ్యడానికి అదొక ఎత్తుగడ. మళ్లీ అందుకున్నాడు నా వెపు తిరిగి " చెప్పండి మేష్టారు! మరోలా అనుకోకండి. ముతక సామెత చెపుతున్నాందుకు - కొత్త చీపుళ్ళ బాగా వూడుస్తాయట. సర్వీస్‌లో చేరి చాలా సంవత్సరాలైపోయింది కదా - మేవంతా మెథడాలజీలు అవీ మరచిపోయాం. మీరు నిన్ననే విడుదలైన సినిమాలాంటివాళ్ళు. అంచేత కాస్త వివరంగా చెప్పండి అ సోక్రటిక్ మెథడ్ గురించి..."

అతనింకా ఎంతసేపు సాగదీసునో తెలీదు గాని, అతన్ని కట్ చేసి సమాధానం ఇచ్చేను, " "సారీసార్. మీరంతా సర్వీస్ చేసి చేసి పాతబడిపోయిన చీపుర్లని మర్చిపోయాను. మెథడాలజీలు మరచిపోవడం సంగతలా వుంచండి అసలు క్లాసులకి వెళ్ళడమన్న సంగతే మరచిపోయి చాలా ఏళ్ళయింది కొంత మందికి ఇప్పుడు మనకి గుర్తున్నదల్లా షేర్ మార్కెట్లు, లాభాల వేటలు, స్పాట్ వాల్యూయేషన్‌లు, సాయంత్రమయేసరికి తీర్థసేవలు - ఇవే కదా! మేథ్స్ హెడ్ గారు త్వరలోనే ప్రిన్సిపల్ కాబోతున్నారట కూడాను. Peter Principle లో చెప్పినట్టు maxmimum level of imcompetence కి చేరుకోగానే ప్రమోషన్ ఇచ్చి మీది గదికి పంపేయాలి"

అంతా గొల్లున నవ్వేరు. మేథ్స్ హెడ్ ముఖం మాడిపోయింది. ప్రిన్సిపల్‌గారి మొహం కందగడ్డలా చేస్కొని " ఐఎడ్జర్న్ దిస్ మీటింగ్"అనేసి తన రూమ్‌లోకి వెళ్ళిపోయారు.

అంతా బిలబిలమంటూ మెట్లు దిగుతున్నాం. మనవేం మాట్లాడుకున్నా ప్రిన్సిపల్‌కి వినపడదు అని ధైర్యం కుదిరాక అంతా నా చుట్టూ చేరి అభినందించడం మొదలెట్టేరు. నన్ను మెచ్చుకుంటున్న ఆ హిపోక్రయట్లని చూస్తుంటే సర్వ ప్రపంచం మీదా జుగుప్సా భావం కలుగుతోంది. ఎలా వీళ్లు క్షణక్షణానికీ రంగులు మార్చేసి వూసరవెల్లులు కూడా సిగ్గుపడేట్టు ప్రవర్తించగలుగుతారో? కొద్ది క్షణాల క్రిందటే కోర్సులు పూర్తయిపోయాయి అని అబద్ధం స్టేట్‌మెంట్లు యిచ్చేరు, నేను వాళ్ల నిజస్వరూపంగురించి ప్రసంగించగానే నానుండి అపోలజీ డిమాండ్ చేశారు. కాకతాళీయంగా ప్రిన్సిపల్ నాతో నెగ్గలేకపోయినట్లు తేలగానే నన్ను అభినందించేస్తున్నారు. మీటింగులో ఒకవేళ నా చెయ్యి క్రిందా, ప్రిన్సిపల్ చెయ్యి మీద అయి వుంటే - నన్ను అమాంతంగా ఆఫీసు రూములోనే కిందపడేసి కుమ్మేసినా ఆశ్చర్యపోనక్కరలేదు. ఇంతంత పెద్ద చదువులు చదివి, యింతింత పెద్ద ఉద్యోగాలు చేస్తున్న వీళ్లలో - నీతి, నిజాయితీ, ఆత్మాభిమానం లాంటావి మచ్చుకి కూడా కనిపించడం లేదే! ఎక్కడికి పోతోంది ఈ దేశం ?

ఎందుకనో తెలీదు "మనమేం చెయ్యలేం" అనే నిస్పృహ ఆవరించేసింది. చీకటి మెల్లమెల్లగా విస్తరిస్తోంది. ఆలోచనల టెన్షన్ భరించలేక మళ్ళీ ఏటివైపు దారి తీశాను. కాలేజీలో ఏనాడూ క్లాసులు జరగవే! అసలు క్లాసులు జరగడం ప్రిన్సిపల్‌కి ఇష్టం లేదేమో! కాకపోతే ఏవిటిది - కాలేజీలో నిత్యం ఏవో దిక్కుమాలిన పరీక్షలు జరుగుతూనే వుంటాయి. పరీక్షల్లేకపోతే పోలీస్‌స్పోర్ట్స్, ఫారెస్ట్ ఆఫీసర్స్ స్పోర్ట్స్, గ్రామీణ ఆటల పోటీలు...ఇలా - వారంలో నాలుగు రోజులు క్లాసుల్లేకుండా చెయ్యడానికి ఏదో ఒక సాకు. బహుశా మేష్టర్లే ప్రిన్సిపల్‌తో కుమ్మక్కయి కాలేజీలో క్లాసులు జరక్కుండా చూస్తున్నారేమో? రెగ్యులర్‌గా క్లాసులు జరిగితే, ఈ మేష్టర్లందరికీ ఇళ్ల దగ్గర వీధిబడుల్లా ట్యూషన్ క్లాసులు ఎలా నడుస్తాయట? అందుకే కాబోలు నేను పాఠాలు చెపుతున్నానని వీళ్ళకి అక్కసు. నన్ను ఏదో విధంగా కించపరిచో, అవమానించో నేను కూడా పాఠాలు చెప్పకుండా చేసి వారి మందలోకి నన్నూ లాగాలని ప్లేనా? ఇలా - ఈ వ్యక్తిత్వం, ఆత్మగౌరవం లేని దౌర్భాగ్యుల మధ్య ఎంతకాలం, ఎంతకాలం, ఎంతకాలంగడపాలి? వీళ్ల మధ్యని బ్రతికి నేనేం ప్రయోజనం సాధించగలుగుతాను? అలాగని వాళ్ల నుండి దూరంగా పారిపోయి మాత్రం ఏం ప్రయోజనం సాధించగలుగుతాను? నాది అని చెప్పుకోదగ్గ ప్రత్యేకత దేన్నేనా నేను సాధించదల్చుకుంటే దాన్ని - ఈ వ్యక్తిత్వం లేని గుంపు మధ్యని వుండి సాధించాలా లేక ఎక్కడికేనా దూరంగా, ఇలాంటి మనుషుల్లేని దగ్గరికి పారిపోయి సాధించాలా? ఎవ్వరూ లేని దగ్గర నేనేదేనా సాధించినా దానికి గుర్తింపేవిటి? ఆ సాధించేది ఎవరి కోసం?" ఇలా ఆలోచనల సాలెగూడు బిగుసుకుంటోంది గుడ్డి వెన్నెల్లో నన్ను చూసి ఏరు కంట తడిపెడుతున్నట్టుభ్రమ. రేఖామాత్రంగా కనిపిస్తున్న ఆ రవ్వంత చంద్రుడూ కృంగి పోతే యింక అంతా చీకటే! బయట చీకటి! మనసులో చీకటి! రంగనాథ రామాయణంలోదా ఈ ద్విపద?

'నడిరేయి అరుదెంచె నరలోకనాథ

కదలక నిలచెను సకల వృక్షములు'

చెట్లేనా నిలిచిపోయింది? కాలం కూడా కదలకుండా నిల్చిపోతే యెంతబావుండ్ను! కాని నిల్చిపోదు. ఎవరో నన్ను 'మేష్టారూ' అని మృదువుగా పిల్చి, ఈ కాలంలోకి, ఈ లోకంలోకీ యీడ్చుకొచ్చేరు. తలతిప్పి చూస్తే సుధాకర్! 'విషాదయోగంలో పడి యెంత పని చేశాను! ఎన్నో యుగాల క్రిందట "నా కోసం వేచి వుండు" అని అతనికి చెప్పి, నా కర్తవ్యం మరచిపోయి యిక్కడ కూర్చుని స్వగతిస్తున్నానా? దారీ తెన్నూ అవుపించక కొట్టుకుంటున్న ఈ GODOT కోసం వెయిట్ చేస్తున్నావా సుదాకర్ వ్లాడ్ మిర్ ఎస్త్రగాన్? నాలాగే నీకూ నిస్పృహే ప్రాప్తం కాబోలు చివరికి!"

ఆలోచనలకి అడ్డుకట్ట వేసి, ఇసక లోంచి లేచి, సుధాకర్ రెండు చేతులూ నాచేతుల్లోకి తీస్కొని "సుధాకర్, వెయిట్ చెయ్యమని చెప్పి, మరచిపోయి యిలా వచ్చేశాను. ప్లీజ్, మరేం అనుకోకు! ఎప్పుడు భోంచేశావో ఏవిటో, నీమాటే మర్చిపోయి యిక్కడ కూర్చొబడిపోయాను. పద - ముందు ఎక్కడికేనా వెళ్ళి ఏదేనా తిందాం"

"ఫర్వాలేద్సార్! ఆకళ్ళు, వేచి వుండడాలు, గొడవలు - యివన్నీ నాకేం కొత్తకాదు కదా!" నిశ్చేష్టుడ్నయ్యాను సుధాకర్ మాటలు విని. మేథ్స్ హెడ్ గారి కొడుకు నోటంట రావలసిన మాటలేనా ఇవి? వాళ్ల నాన్నగారికి డబ్బుకి లోటుండ కూడదు. ఆయన టేక్ హోమ్ సేలరీనే ఆరేడు వేలుండవచ్చును. మరి ఆకలి, వేచి వుండడాలూ అంటాడేవిటి ఈ కుర్రాడు? మంచి డ్రెస్ వేస్కొని నీట్‌గా క్లాస్‌కి ఈ కుర్రాడు రావడం నేను చూడ్లేదు.దీని వెనకాతల యింకేమైనా కారణాలున్నాయా? అనిపిస్తోంది.

నేనూ, సుధాకరు మెల్లగా నడుస్తున్నాం. నక్షత్రాల వెలుతురు తప్పించి మరే వెలుగూ లేదు. నడుస్తున్నవాడల్లా సడన్‌గా ఆగి " సార్ నేను చదువు మానేయాలనుకుంటున్నాను" అన్నాడు సుధాకర్.

"అవును, సాయంత్రం పోర్టికో దగ్గర యిదే మాట చెప్పేవు. ఎందుకని మానేద్దామనుకుంటున్నావ్?"

"సార్, మన కాలేజీలో ఏనాడూ ఎటెండెన్స్ మార్క్ చెయ్యడం వుండదు కనక మీకు తెలిసి వుండకపోవచ్చు. నా పేరు రోల్స్ నుండి తీసేశారు. రెండో టెర్మ్‌లో"

"అదే, ఎందుకు తీసేశారని?"

"రోల్స్ నుండి ఎందుకు తీసేస్తారు సార్! ఫీజులు కట్టకపోతే తీసేస్తారు"

"సుధా! నాకర్థమయేలా చెప్పలేవా?"

"మీకర్థం కాలేదంటే నేనొప్పుకోను సార్! నాచేత చెప్పించాలని మీ ఉద్దేశం"

"పోనీ అలాగే అనుకో! నీ పరిస్థితి గురించి నేను వూహించడం వేరు నువ్వు వివరించడం వేరు కదా!"

"ఇందులో వూహించడానికి మాత్రం పెద్దగా ఏముంది సార్! మా నాన్నగారి సేలరి ఆయన అలవాట్లుకీ, ఖర్చులకీ సరిపోతున్నట్టులేదు. అంచేత బయట చాలామంది దగ్గర అప్పులు చేశారు. అప్పులవాళ్ళు ఇంటికొచ్చి బాకీలు చెల్లించమని అడుగుతుండడం, కేకలు వెయ్యడం, బెదిరించడం - ఇవన్నీ తరచుగా జరుగుతుంటాయి. సిగ్గుతో తలెత్తుకుని తిరగలేకపోతున్నాం వీధిలో సిగ్గెగ్గుల మాట ఎలా వున్నా మనిషికి ఆకలంటూ వుంటుంది కదా, తిండానికి అన్ని రుచులూ కాకపోయినా, కనీసం చారు, అన్నమేనా కావాలి కదా! అదీ సరిగ్గా దొరకని రోజుల్లోకి వచ్చేస్తున్నాం సార్! అందుకని చదువు మానేసి అర్జంటుగా నేనేదేనా పని వెతుక్కోవాలి"

"ఫీజు కట్టడమే సమస్య అయితే, నేను కడతాను సుధాకర్! నువ్వు మాత్రం చదువు మానెయ్యకు"

"థాంక్స్ సార్ - మీరామాట అంటారని నాకు తెల్సు. మీ అవసరాలు కూడా చూస్కోకుండా, చాలా మందికి మీరు డబ్బు సాయం చేస్తున్నారని క్లాసులో మా అందరికీ తెలుసు మాస్టారు, మీ

అవుదార్యం మాటలకే పరిమితం కాదని తెలుస్తూనేవుంది. అందుకే మా అందరికీ మీరంటే అంత గౌరవం. ప్రపంచంలో ఎవరికీ చెప్పుకోలేని నా అవస్థ మీకొక్కరికే చెపుతున్నానంటే మీరంటే మాకెలాటి గౌరవమో మీరు వూహించగలరు సార్!"

"థాంక్స్ సుధాకర్ ! వీలయినంతమట్టుకి యితరులకి సాయపడాలన్నది మన పర్సనల్ ఫిలాసఫీ కావాలన్నదే నేనాశించేది. ఫీజు కట్టడానికి డబ్బు లేదన్నది ఒక్కటే సమస్య అయితే, ప్లీజ్, చదువు మానేయకు. నేను ఫీజు కడతాను"

" మా నాన్నగారు కూడా మీలా ఆలోచించగలిగితే ఎంత బావుణ్ణు సార్! కాని మాకా అదృష్టం లేదు. మేష్టారూ, ఒక్కవిషయం మీరు ఆలోచించేరా?"

"దేని గురించి?"

'మీరు గాని ఫీజు కడితే, మా నాన్నగారు ఆ అవమానాన్ని భరించగలరంటారా?"

" అదే అతగాడికి తగిన శాస్తి. బాధ్యతల్ని మరచిపోతున్న మనిషి ఈ అవమానాల్ని భరించి తీరవలసిందే!" నా గొంతులో వుద్రేకం ధ్వనించింది. కొద్దిసేపు ఏ మాట అనకండా వూరుకున్నాడు సుధాకర్. తరువాత నెమ్మదిగా "కాని మా నాన్నగారికి అవమానం జరగడం నేను సహించలేను సార్" అన్నాడు.

ఊహించని పిడుగు మీద పడినట్టయింది. సుధాకర్ మాటలతో నిశ్చేష్టుడ్నయాను. తండ్రి వల్ల తమ మొత్తం కుటుంబం పడుతున్న అవమానం యీ కుర్రాడే యిప్పటిదాకా చెప్పుకువస్తున్నాడు. మళ్ళీ యీ క్షణంలో యీ కుర్రాడే తన తండ్రికి అవమానం జరిగితే సహించలేనంటున్నాడు. మనుషుల్ని ఎలా అర్థం చేస్కోవాలి?

సుధాకర్ మళ్లీ ప్రారంభించేడు. "ఆయన వ్యసనపరుడు కావచ్చు, బాధ్యతల్ని మరచిపోతున్న వ్యక్తి కావచ్చు. కాని ఆయనకి అవమానం జరక్కూడదు సార్! ఎందుకనంటే, ఆయనకి కూడా మీలాగే గొప్ప టీచరని పేరుండేది ఒకప్పుడు. చాలాకాలంగా ఆయన పాఠాలు చెప్పడం మానేశారు గనక అతని గురించి చెడే తప్ప మంచిగా ఎవరూ మాట్లుడుకోవడం లేదిప్పుడు, కాని చిన్నప్పుడు నాకుగుర్తున్న సంగతులు చెప్తాన్సార్! అప్పటికి మేమింకా యీ వూరు రాలేదు. గుంటూరులో ఆ రోజుల్లో ఆయన పాఠం చెప్తుంటే, స్టూడెంట్స్ అతన్ని దేవుడ్ని చూసినట్టు చూసేవారు. ఏవేనా అనుమానాలు క్లియర్ చేస్కోడానికి స్టూడెంట్స్ యింటికి వస్తుండేవారు. నాకేవీ అర్థంకాకపోయినా ఆయన చెప్తున్న పాఠాలు వింటూ కూర్చునేవాడ్ని. మృదువుగా, చిన్నపిల్లలకి కూడా బోధపడేంత సులువుగా ఆయన చెప్తుంటే, వచ్చిన స్టూడెంట్స్ కళ్ళలో భక్తిభావం కదులుతూ వుండేది. మేమిప్పుడు మిమ్మల్ని ఎలా చూస్తున్నామొ - అచ్చం అలాగే ఆ రోజుల్లో స్టూడెంట్స్ అతన్ని చూసేవారు. అలాంటి గొప్ప టీచర్ని ఎవరేనా అవమానిస్తే నేనెలా సహించగలను మేష్టారూ? నేనే అతన్ని అవమానించడానికి దిగితే, యిన్నాళ్ళుగా మిమ్మల్ని చూసి నేర్చుకున్న సంస్కారానికి అర్థమేమిటి సార్?" ఉద్వేగాన్ని ఆపుకోలేక వెక్కి

వెక్కి ఏడుస్తున్నాడు సుధాకర్.

సుధాకర్‌ని వూరుకోపెట్టడం మాట అటుంచి, నన్ను నేను ఎలా వూరడించుకోడం? నా నుంచి సంస్కారాన్ని నేర్చుకున్నాడా యీ సుధాకర్? కాని ఓ గంట క్రితం వాళ్ల నాన్నగార్ని నేనే చచ్చేట్టు అవమానించేనన్న సంగతి తెలిస్తే, నా సంస్కారం గురించి ఏమంటాడో సుధాకర్? సుధాకర్, సుధాకర్ సంస్కారం నిన్ను చూసి నేను నేర్చుకోవలసిన పరిస్థితి వచ్చినట్టుందయ్యా! నీవిప్పుడు కనపరుస్తున్న ఔన్నత్యం ముందు, నేను కొద్దిసేపటి క్రిందట ప్రదర్శించిన అల్పత్వాన్ని గురించి నీకు చెప్పగలిగే ధైర్యం నాకు లేదే! నా మేడిపండు రూపాన్ని చూపించి, భ్రమలు కల్పిస్తున్నాను మీ అందరికీ!

ఈ క్షణంలో చీకటి నన్ను బయటపడనివ్వకుండా రక్షించింది. చీకట్లో మాటలు వినిపిస్తాయి, ముఖాలు కనిపించవు. తప్పు చేసిన భావం చుట్టుముడుతోంది. సుధాకర్‌తో కలసి నడుస్తుంటే ఆ క్షణంలో Epiphany (సాక్షాత్కారం) అంటారే, అలాంటి భావం కలుగుతోంది.

బుడ్డిదీపపు వెలుతుర్లో రేపటిక్కావలసిన టిఫిను సరంజామా తయారుచేసుకుంటున్నాడు బాబులు. తిండానికి ఏవీ లేదట - బ్రేడ్ తప్ప. అదే ఇమ్మని చెప్పి, వాటర్ టేంక్ క్రిందని గట్టు మీద చతికిలబడ్డాం. బ్రెడ్ స్లయిసెస్ వచ్చాయి వాటిని నవులుతూ ఆగిపోయిన సంభాషణ మళ్ళీ మొదలుపెట్టాను.

"సరే, చదువు మానేసి ఏం చెయ్యాలని నీ ప్లాను"?

"ఇంతవరకూ ఎవరికీ చెప్పలేదు సార్! మీతో చెప్పి మీ ఎప్రూవల్ తీసుకుందామనే సాయంత్రం నుంచీ వెయిట్ చేస్తున్నాను. నేను సాయంత్రాలప్పుడు జిలానీ కొట్టు దగ్గర కూర్చుని వుండడం మీరు చాలాసార్లు చూసారు. ఈ వూరొచ్చిందగ్గర్నుండి నాకతన్తో స్నేహం. నేను చదువుకోడానికి కాలేజీలో చేరి సాధించింది ఏవీ లేదుగాని, అతగాడు చిన్నప్పుడే మెకానిజం నేర్చుకుని, ఇవాళ రోజుకి మూడు నాలుగు వందలు సంపాదించగలుగుతున్నాడు. పైగా తన చేతికింద మరో నలుగురికి పని కల్పించాడు. ఉత్తినే కూర్చుని ఏం చేస్తుంటావు, మెలకువలు కాస్త కాస్త నేర్చుకుంటూ వుండు అని ప్రోత్సాహించే వాడు సార్ జిలానీ. విద్య చేతిలో వుంటే ఎప్పడేనా పనికొస్తుందని నస పెట్టేవాడు. అతని నస భరించలేక నేర్చుకున్న స్కూటర్ మెకానిజం నా అవసరానికి ఇప్పుడు పనికొస్తుంది సార్! అతని షాపులోనే హెల్పర్‌గా చేరితే, రోజుకో ముప్ఫయ్, నలభయ్ రూపాయిలు ఇవ్వకపోడు.

"ఇస్తే"

"ఇస్తేనా? ఇంట్లో భోజనానికి తిప్పలు తప్పుతాయి సార్"!

సుధాకర్‌కి ఏమని సమాధానం ఇవ్వడం? మన చదువుల వల్ల వచ్చే ప్రయోజనం ఏవీ లేదని రుజువవుతూనే వుంది. అలాంటప్పుడు ఈ కుర్రాడ్ని చదువుకొని తీరాలని ఎలా బలవంతపెట్టగలను? ఎంతెంత చదువులు చదువుకున్నా బతుక్కి ఒక ఉపాధి దొరుకుతుందనే

ఆశలేదు. బాధ్యతలు తెలియకుండా బ్రతకవలసిన ఇంత చిన్న వయసులోనే, బాధ్యతల్ని నెత్తి మీద వేసుకుని, నా అస్థిత్వాన్ని నిరూపించుకుంటానని ముందుకువస్తున్న సుధాకర్‌ని ఏ రకంగా మెచ్చుకోవాలి? ఎందుకో ఈ కుర్రాడు నా కంటే బాగా ఎత్తుకి ఎదిగిపోయిన వ్యక్తిలా అనిపించాడు.

"బాగా ఆలస్యం అయింది - వెళ్దాం పద" అని లేచాను.

నడుస్తున్నాం. సినిమా వదిలే వేళ అయింది. రిక్షా ఎదురయింది. తీరాచూస్తే అది తవిటయ్య రిక్షానే. " కాస్త ఇంటిదాకా తీస్కెళతావేమిటి తవిటయ్యా" అనడిగాను. రిక్షావాళ్ళలో తవిటయ్యలాటి సొమ్యులు చాలా అరుదుగా కనిపిస్తారు. అలాటి మంచివాడు కూడా, నేనడిగిన దానికి ఔను కాదు అని సమాధానం ఇవ్వకుండా దేనికో తటపటాయిస్తున్న వాడిలా కనిపించాడు. మళ్ళీ రెట్టించి అడిగేసరికి "అయ్యగారు క్లబ్బు నుండి ఇంటికొచ్చే ఏళయిపోనాదండీ. క్లబ్బు కెళ్లాలయ్యా!" అన్నాడు

అయ్యగారంటే మేథ్స్ హెడ్. తవిటయ్య సమాధానం విని సుధాకర్ గాభరా పడ్డాడు. " నాన్నగారు ఇంటికొచ్చేసరికి నే నింట్లో వుండకపోతే బాధపడతారు సార్! అంచేత నేను దగ్గర తోవలో ఇంటికెళతాను రేపు కలుస్తాన్ సార్!" అనేసి గబగబా చీకట్లో కలిసిపోయాడు. తవిటయ్య కూడా రిక్షాని తొక్కుకుంటూ క్లబ్బు వైపు వెళ్ళిపోయాడు.

మానవ సంబంధాలు ఎంత చిత్రంగా వుంటాయి! లేకపోతే ఈ తవిటయ్య loyalty కి అర్థం ఏమిటి? ఊళ్ళో అందరూ ఈసడించే మేథ్స్ హెడ్ ఈ తవిటయ్యకి దేముడితో సమానం. తన రిక్షా తొక్కుతున్నది కేవలం అయ్యగారి కోసమే, మరెవ్వరి కోసమూ కాదన్నట్టుగా వుంటుంది వాడి ప్రవర్తన. అలాగని మిగతావాళ్ళని తూలనాడుతున్నట్టు చూస్తాడా అంటే, అబ్బే, మర్యాద ఇవ్వడంలో వాడ్ని చెప్పి మరొకడ్ని చెప్పాలి. క్లబ్బు నుండి తాగొచ్చే తండ్రిని కూడా హర్ట్ చెయ్యకూడాదనుకునే సుధాకర్! మనుషుల గురించి మన ఆలోచనల్లో ఏదో పొరపాటు వుండివుండాలి!

☆ ☆ ☆

నాల్రోజులు తర్వాత నా రూములో కూర్చుని నోట్స్ తయారు చేసుకుంటున్నాను. 'రావచ్చునా సార్!' అన్న మాట విని తలెత్తి చూస్తే, ద్వారం దగ్గర మేథ్స్ హెడ్ ఇతనెందుకు వచ్చేడూ నా రూముకి? ఆవేళ మీటింగులో జరిగిన దానికి నాతో గొడవ వేస్కోవాలని వచ్చాడా? ఇక మీదట ఎవర్నీ నొప్పించకూడదు అని ఇప్పుడిప్పుడే నిర్ణయం చేసుకుంటున్నాను. ఇంతలోనే ఇతడితో గొడవకి దిగాలా? సరే, ఏది ఏమైనా అతగాడితో గొడవ పెట్టుకోను. అతను ఎంత నిర్దయగా తిట్టినా పడి వూరికుంటాను. నిర్ణయం జరిగిపోగానే "అదేవిటి సార్! మీరు రావడానికి అనుమతి కోరడమేమిటి? రండి సార్, ఇలా కూర్చోండి!" అని ఆహ్వానించి, కుర్చీ చూపెట్టాను.

కూర్చుని సిగరెట్ వెలిగించేడు. అతనిలో ఏవో ఆలోచనలు సుళ్ళు తిరుగుతున్నట్టు

పసిగట్టెను. అతను అనదలుచుకున్న మాటల్ని తేల్చుకోడానికి అతనికి కాస్త అవకాశం ఇవ్వడం మంచిదనిపించింది. "టీ తెప్పిస్తానుండండి సార్" అని అనేసి రూమ్ బయటికి వచ్చేను. ఫిజిక్స్ లేబ్ స్వీపర్ని టీ తేవడానికి బాబులు షెడ్‌కి పంపించి, తిరిగి వచ్చేసరికి అయిదు నిముషాలు పట్టింది. కూర్చుంటూ "కాలేజి నిశ్శబ్దంగా వుంది క్లాసుల్లేవా సార్?" అనడిగాను.

"ఎస్.ఎఫ్.ఐ. వాళ్ళు మెస్ ఛార్జీల మొత్తాలని పెంచాలని Agitate చేస్తున్నారు. కాలేజిలో గొడవవలెందుకని ప్రిన్సిపల్‌గారు వర్క్ సస్పెండ్ చేశారు".

"అమ్మయ్య, ఇవాల్టికి పాఠాలు చెప్పకుండా తప్పించుకోడానికి ఏదో సాకు దొరికిందన్న మాట!" అనుకోకుండా వెటకారపు కామెంట్ నోటి నుండి వచ్చేసింది. ఎన్ని నిర్ణయాలు చేసుకుంటేవేం - సమయం వచ్చేసరికి కుక్కబుద్ధి! అయితే నా కామెంట్‌ని మేథ్స్‌హెడ్‌గారు పట్టించుకోకపోవడం ఆశ్చర్యం! నేను సాధించాలని ఆశిస్తున్న సంయమనాన్ని, ఇతగాడు అప్పుడే సాధించేశాడా?

టీ వచ్చింది సిప్ చేస్తూ " మాస్టారూ! మిమ్మల్నొక ప్రార్థన చెయ్యాలని వచ్చాను" అన్నాడు. ఆ మాట వినగానే నాకు మూర్ఛ వచ్చినంత పనయింది. అవకాశం వస్తే చాలు నా మీదకి వ్యంగ్యాస్త్రాలు సంధించడానికి సిద్ధంగా వుండే మేథ్స్ హెడ్‌గారేనా నా ముందు కూర్చున్నది? కాని అతనడిగిందానికి ఏదో సమాధానం చెప్పాలి కదా!

"మాస్టారూ, మీరు నా కంటే అన్ని విషయాల్లోనూ పెద్దవారు. అంచేత మీ అంతటివారు ప్రార్థన, మనవి' లాంటి మాటల్తో నన్ను చిన్నబుచ్చడం ధర్మం కాదు".

"కాదు మేస్టారూ, నిజంగానే మిమ్మల్ని సాయం చెయ్యమని అడగడానికి వచ్చాను".

"మాష్టారూ, ప్లీజ్ అలా మాట్లాడ్డం మానేయండి. నేను నిజంగా ఏదేనా సాయం చెయ్యగలిగే స్థితి వుంటే, సాధికారంగా అడగండి. అంతేగాని అనవసరంగా నన్ను అందలం ఎక్కించి సిగ్గుపాలు చెయ్యకండి."

"మిష్టర్ వివేకానంద్ - అసలు విషయానికొస్తాను. మా అబ్బాయి సుధాకర్‌కి మీరంటే కొండంత గౌరవం."

"అదిగో మేస్టారూ, మీరు మళ్ళీ నన్ను ఎంబరాసిగ్ పొజిషన్లో పెడుతున్నారు"

"మిమ్మల్ని flatter చేద్దామని నేనిక్కడికి రాలేదు వివేకానంద్! ఇవాళ నా గుండె మంటని మీతో చెప్పుకుని వూరట పొందాలని వచ్చాను."

"మాసారూ, ఊహించని గౌరవాన్ని ఇచ్చి నన్ను చాలా ఇబ్బంది పెడుతున్నారు"

"మీరు ఇవాళ వినక తప్పదు నా సోది. నేను చెప్పబోతున్నది ఒక విధంగా నా Confession గా భావించండి, నిజానికి నా నిజస్వరూపం మీరనుకుంటున్నంత ఘోరమైందేమీ కాదు. సర్వీసులో చేరిన కొత్తలో నేను ఇప్పటిలా లేను."

"అవును, సుధాకర్ అలానే చప్పాడు. ఒకప్పుడు మీరూ గొప్ప డెడికేటెడ్ టీచర్‌గా వుండేవారనీ, విధ్యార్థులు మిమ్మల్ని దైవంతో సమానంగా చూసుకునేవారనీ"

"అలా చెప్పేడా నిజంగా?"

"చెప్పాడు సార్! సుధాకర్‌కి మీరంటే ఎంత ఆరాధనో బహుశా మీకు తెలీదు"

"నిజంగా వాడికి అలాంటి భావాలున్నట్టు నాకు తెలీదు వివేకానంద్! సుధాకర్ అలాటి మాటలన్నాడని మీరు చెప్తుంటే, ఎడారిలాంటి నా మనసులో వర్షం కురిసినట్టు ఆనందం కలుగుతోంది. నేను గుంటూరులో వున్నప్పుడు అంతా చాలా మంచి టీచర్నని అంటుండేవారు. ఏ దుర్ముహూర్తంలో ఈ వూరొచ్చానో తెలీదాగాని, ఇక్కడికి వచ్చాకనే నా పతనం ప్రారంభమయింది. ఎవరినో అనుకుని ఏం లాభం, నాకు వ్యసనాలు నేర్పేరని? నాలో బలహీనత వల్లనే నేను అన్ని రకాల వ్యసనాలకీ బానిసనైపోయాను. నా పూర్వపు ఔన్నత్యం అనుక్షణం గుర్తుకు వస్తూనే వుంటుంది. అయినా కూరుకుపోయిన ఈ నరకంలోంచి లేవలేకపోతున్నాను. కుటుంబాన్ని పస్తులు పెడుతున్నానుగాని వ్యసనాలు మానుకోలేకపోతున్నాను."

వేదన ఉక్కిరిబిక్కిరి చేస్తుంటే మరి మాట్లాడలేకపోయాడు. అతని కళ్ళ నిండా నీరు.

అతన్ని ఎలా ఊరడించాలో తెలీక, " మాస్టారూ, ఇవన్నీ నాతో ఎందుకు చెప్పండి? ఇవి మీ వ్యక్తిగత విషయాలు. అంచేత ఇవి ఇతరులకి తెలియకుండా వుండడమే మంచిది. ముఖ్యంగా మీ విషయాలు నాకు తెలియకుండా వుండడం మరీ మంచిది. ఎంచేతంటే మీ వ్యక్తిగత విషయాలు తెలిస్తే, నేను వాటిని ఆధారం చేసుకుని మీ మీద దాడిచేసే ప్రమాదం వుంది. అందుచేత, దయచేసి ఈ విషయాలు నాతో చెప్పకండి సార్!" అన్నాను.

"మీరు చెప్పిందీ నిజమే! నా బలహీనతలు తెలియబట్టే కదా, మొన్న మీటింగులో అందరి ముందూ నన్ను అవమానించగలిగారు! మీరు నా గురించి అన్న మాటలన్నీ నూటికి నూరుపాళ్ళు నిజమే! కాని ఏం చెయ్యగలను చెప్పండి - బలహీనతల్ని అదుపులో పెట్టుకోలేని అశక్తుడ్నయిపోయాను. మరణం తప్ప మరేదీ నన్ను వుద్ధరించగలిగేది లేనట్లుగా కనిపిస్తోంది.'

కరెంట్ షాక్‌లా తగిలాయి ఆ మాటలు. కుర్చీలో కూర్చున్నవాడ్ని లేచిపోయి, చేష్టలుడిగి శూన్యంలోకి చూస్తూ నిలబడ్డాను. ఒక భయంకరమైన నిజం ఇప్పుడే నాకు తెరిపొచ్చింది. నేను చేసిన అవమానం భరించలేక, ఇతగాడు ఏ ఆత్మహత్యకో దిగివుంటే! అప్పుడు లోకంలో నా ఇమేజ్ ఎలా వుండివుండేది? మనిషుల్ని అవమానించడం చాలా సుళువు. కాని దాని వల్ల ఒక్కొక్కప్పుడు సంభవించే దారుణమైన ఫలితాల్ని ఫేస్ చెయ్యగలమా? రెండడుగులు ముందుకు వేసి, మేథ్స్ హెడ్ గారి రెండు చేతులూ పట్టుకొని "మాస్టారూ, నేను చేసిన తప్పు ఎంత తీవ్రమయిందో ముందుగా సుధాకర్ వల్ల తెలిసొచ్చింది. ఇప్పుడు మీ మాటలు వింటుంటే, నేను చేసినతప్పుకి ఫలితాలు ఎలా వుండ వచ్చునో తెలిసింది. నాకేదో తెలుసునని ఇన్నాళ్ళూ విర్రవీగుతున్నాను. కాని మనుషుల గురించి, మనస్తత్వాల గురించీ నాకేమీ తెలీదని

ఇప్పుడిప్పుడే తెలుస్తోంది. " ఒరులేయవి యొనరించిన" అన్న తిక్కనగారి పద్యం కంఠస్తా వచ్చును. కాని ఆ పద్యంలో వున్న మహార్థం మాత్రం ఇప్పుడిప్పుడే అవగతమవుతోంది. ప్రపంచంలో ఏ ప్రాణికీ ఎటువంటి బాధ కలిగించకుండా జీవించగలగటమే అన్నిటి కన్నా ఉత్కృష్టమైన తపస్సని అనిపిస్తోంది. నన్ను మన్నించండి - సాధ్యమయినంత మేరకి ఇక మీదట ఎవరికీ బాధ కలిగించకుండా బతకడానికి ప్రయత్నిస్తాను."

"వివేకనంద్! మిమ్మల్ని నేను, నన్ను మీరు క్షమించండి, క్షమించండంటూ కూర్చోడం బత్తిగా తెలుగు సినిమా సెంటిమెంటులా వుంది. ఇక ఈ క్షమాపణల తతంగం కాసేపు ఆపి, బిజినెస్‌లోకి వద్దాం. చెప్పేను కదా - మీసాయం కోరి వచ్చాను - చేస్తారా లేదా?"

"చెప్పండి మాస్టారూ - నేను చెయ్యగలిగిన సాయం ఏదైనా వుంటే తప్పక చేస్తాను. చెప్పండి!"

మరో సిగరెట్ వెలిగించి ఆరంభించాడు మేథ్స్ హెడ్ "వివేకానంద్, మా అబ్బాయి చదువు మానేసి మెకానిక్‌గా చేరతానంటున్నాడు. దాన్ని మీరు ఎలాగైనా ఆపాలి."

"మాస్టారు, మీకు తెలియందేంవుంది, మన చదువులు ఉత్త దండగ చదువులు. అందులోనూ సుధాకర్ ఎన్నుకున్నది ఫిలాసఫీ గ్రూపు. ఈ సబ్జెక్టు ఏ విధంగానూ కూడు పెట్టదు. మనం జీవించడానికి ఎప్పటికైనా ఒక బతుకు తెరువు వెదుక్కోవాలి కదా! సుధాకర్ కాస్త ముందుగానే తెలివితెచ్చుకొని నాలుగు రాళ్ళు సంపాదించుకుంటానని ముందుకి వస్తుంటే, మనం ఎందుకు అడ్డు తగలాలి చెప్పండి? బతుకు గురించి సుధాకర్‌కి వున్న అవగాహన నాకూ చిన్నప్పుడే వుండివుంటే, నా జీవితం ఇంతకంటే మెరుగ్గా వుండి వుండేదేమో."

"మీ జీవితానికి ఏం వొచ్చిందిలెండి ఇప్పుడు!"

"ఏమి వచ్చిందని కాదు - ఏదీ రాదనే భరోసా మనవి ఎందుకూ పనికిరాని వాళ్ళ క్రింద మారుస్తోంది. ఉద్యోగంలో భద్రత వున్నదిలే అనే భావం - నన్నింక ఈ ఉద్యోగం లోంచి దేవేంద్రుడు కూడా తొలగించలేడనే ధీమా - ఇవి మనల్ని జాతి మొత్తంగా నిర్వీర్యుల్ని చేసి పారేస్తోంది. ప్రభుత్వ వుద్యోగాల కోసం అర్రులు చాస్తుంటాం మనందరం ఎందుకనిట? ప్రభుత్వవుద్యోగం దొరికితేచాలు, - ఇక మననీ వుద్యోగం లోంచి ఎవరూ తొలగించలేరన్న ధీమా వచ్చేస్తోంది. దాంతో బద్ధకం, అలక్ష్యం, క్రమశిక్షణా రాహిత్యం మనలో చోటుచేసుకుంటున్నాయి. అక్కడితో ఆగడం లేదు మనం. తిన్న ఇంటి వాసాలు లెక్కబెట్టే స్థాయికి ఎదిగాం. గవర్నమెంటు జీతాలు తింటూ, గవర్నమెంటు సంస్థల్లో పనిచేస్తూ, ఆ గవర్నమెంటు వ్యవస్థనే శక్తి మేరకు తూట్లు పొడిచి అది దివాలా తీసేందుకు అవిశ్రాంతంగా కృషి చేస్తుంటాం. మనిషి జీవితాన్ని అభద్రతా భావం అనే దెయ్యం వెన్నాడకూడదనే కదా ప్రభుత్వ రంగ యాజమాన్యంలో వుద్యోగాలు వుండాలని మార్క్స్, రస్సెల్‌లాటి మహా మేధావులు సూచించింది! కాని తీరా మనం కోరుకున్న ప్రభుత్వరంగ యాజమాన్యం రాగానే, పనిగట్టుకుని మరీ ఆ వ్యవస్థని దివాలా

తీయించి, ఉత్తి అసమర్ధ వ్యవస్థగా మారుస్తున్నాం. దేశంలో ఏ ఒక్క ప్రభుత్వరంగ సంస్థలోనేనా ఉద్యోగులు చిత్తశుద్ధితోనూ, నిజాయితీతోనూ పనిచేస్తున్నారేమో చూడండి ! మన కాలేజీ లెక్చరర్ల సంగతి సరేసరి, పేరుకిమేధావి వర్గం , తీసుకుంటున్నది యు.జి.సి. వేతనాలు, కాని మనం చేస్తున్నదేమిటి? మనవాళ్ళలో అత్యధిక సంఖ్యాకులు ఏనాడూ క్లాసులు తీస్కోరు. సైన్స్ మాస్టర్లయితే - ట్యూషన్ల కోసమని ఓ పధకం ప్రకారం క్లాసులు ఎగ్గొట్టడం చేస్తుంటారు.

ఇక్కడ మరో వింతని మీరు గమనించే వుంటారు. మన సైన్స్‌మాస్టర్లు చాలామంది ప్రైవేట్ వ్యక్తులు నడువుతున్న ట్యుటోరియల్ కాలేజీల్లో పార్ట్‌టైమ్ లెక్చరర్లుగా పనిచేస్తున్నారు. వాళ్ళకి గంటకింతా అని లెక్కగట్టి ఆ ప్రైవేట్ యాజమాన్యం పే చేస్తూ వుంటుంది. రోజుకి ఓ మూడు గంటల వంతున బానిసల్లాగ చచ్చేంత చాకిరీ చేసి, టెస్టులు పెట్టి, దిద్ది ఆ ప్రైవేట్ యాజమాన్యాన్ని మెప్పించడానికి శాయశక్తులా తంటాలుపడతారు. కాని ఇదే వ్యక్తు లు మాతృసంస్థలో నెలకి ఆరేడు వేల రూపాయిలు జీతం తీసుకుంటూకూడా కనిసం ఒక రెండు గంటలేనా కష్టపడి చెప్పరు. మనలాటి వుద్యోగస్తుల వల్లనే ప్రభుత్వరంగ సంస్థలు inefficiency కీ, అక్రమ ఆర్జనలకీ, మారుపేర్లయి కూర్చున్నాయి.

ఇలాటి నికృష్ట వ్యవస్థని కాలదన్ని, సొంతంగా ఇప్పట్నుంచే తన కాళ్ళమీద తను నిజాయితీగా నిలబడతానని సుధాకర్ ముందుకొస్తుంటే, మనం ఎందు కతడ్ని నిరుత్సాహపరచాలి ? ఎవరి కృషి ఫలితం ఎలా వుంటుందో మనమెలా చెప్పగలం ? రెండేళ్ళలో సుధాకర్ స్వయంగా గ్యారేజి తెరిచి, మరో నలుగురికి పని చూపించగలుగుతాడేమో!మనలాంటి వాళ్ళం మనకిమనం ద్రోహం చేసుకుంటూ, మాతృ సంస్థలకి ద్రోహం చేస్తేనేగాని సంపాదించలేని దిక్కుమాలిన డబ్బుని - నిజాయితీగా పని చేసి, మంచి efficient మెకానిక్‌గా పేరు పొంది సుధాకర్ సంపాదించగలడేమో ! ఏ మార్పులేని గానుగెద్దు జీవితానికి బదులుగా, ఛాలెంజితో కూడుకున్న లైఫ్‌ని లీడ్ చెయ్యడానికి అతనికి మనం ఎందుకు అవకాశం కల్పించకూడదు ?"

"బావుందివివేకానంద్ - మీ సామాజిక విశ్లేషణ చాలా బావుంది. కాని నేను మీ దగ్గరకి వచ్చింది, ఈ సామాజిక విశ్లేషణ వినడానికి కాదు, నా వ్యక్తిగత సమస్యకి పరిష్కారం చూపించమని అర్ధించడానికి . నేను సీనియర్ లెక్చరర్ని . మీరన్నట్టు కొద్ది రోజుల్లో ప్రిన్సిపల్‌ని కాబోతున్నాను. ఇలాంటి సమయంలో నా కొడుకు చదువు మానేసి స్కూటర్ మెనానిక్‌గా చేరితే, ఇప్పటికే నాశనమైపోయిన నా పరువు ప్రతిష్టలు ఇక శాశ్వతంగా భూస్థాపితమైపోతాయి. అందుకని, .... అందుకని .... వాడు చదువు మానేయకుండా చూడమని మిమ్మల్ని రిక్వెస్టు చేస్తున్నాను.

"సుధాకర్ నిర్ణయానికి మీరే కారణం అంటే కోపం తెచ్చుకోరు కదా?"

"తెచ్చుకోను మాస్టారూ ! వాడ్ని ఈ desparate state కి చేరుకునేట్టు చేసింది నేనేనని నాకు తెలుసు. "

"క్షమించండి - నేనిలా అంటున్నందుకు - మీ ఇంటి పరిస్థితులు గురించి మీకు అవగాహన వుందన్నమాట. "

" ఎందుకు లేదూ? వుంది ! నా ఇంటి పరిస్థితుల గురించి పూర్తిగా నాకు తెలుసు . నాభార్యకి కట్టుకోవడానికి మంచి చీరలు కూడా లేవని నాకు తెలుసు . నా పిల్లలు స్కూళ్ళకీ, కాలేజీకి వెళ్ళేటప్పుడు వేస్కోడానికి మంచి డ్రెస్సులు లేవనీ నాకు తెలుసు. చాలీచాలని తిండితో కుటుంబంలో అందరూ ఈసురోమని వున్నారనీ నాకు తెలుసు. అప్పులవాళ్ళు తరచు ఇంటికి వచ్చి క్రియేట్ చేస్తున్న సీన్లు గురించీ నాకు తెలుసు. కాని ... కాని ... చెప్పానుగా , నన్ను నేను అదుపులో పెట్టుకోలేని దౌర్భాగ్యుడ్నయిపోయాను."

వెక్కి వెక్కి ఏడవడం మెదలెటట్టాడు మేథ్స్ హెడ్. నేనాయన చతులు పట్టుకుని, మాస్టారూ, "మాస్టారూ, ప్లీజ్ కంట్రోల్ యువర్ సెల్ఫ్ " అని బతిమాలడం మొదలెట్టాను. కొంచెం ఆయన స్థిమిత పడ్డాక మరి వుండబట్టలేక అడాగేశాను. " మాస్టారూ, ఇంత తెలిసినవారు ... " పూర్తిచెయ్యలేకపోయాను. "పూర్తిచెయ్యలేదేం ? ఇన్ని తెలిసినవాడ్ని ఎందుకిలా బాధ్యతారహితంగా ప్రవర్తిస్తున్నాననే కదూ మీ ప్రశ్న? చెప్తే నమ్ముతారో లేదో తెలీదుగాని మాస్టారూ, నన్ను నేను మార్చుకోవాలని మెయ్య రకాలుగా ప్రయత్నిస్తున్నాను. కానీ సాయంత్రం అయ్యేసరికి మనసు పిచ్చెక్కిన గుర్రంలా ప్రవర్తిస్తుంది. ఏం చెయ్యాలో తోచడం లేదు.

మేథ్స్ హెడ్‌గారు జలజల రాలుతున్న కన్నీళ్లని కర్చీఫ్‌తో వత్తుకుంటున్నారు. ఇద్దరం మాట్లాడ్డానికి ఇంకేమీ లేని వాళ్ళలా నిశ్శబ్దంగా కూర్చున్నాం. అటెండర్ ఫిజిక్స్ లేబ్ తాళాలు బిగుస్తున్న చప్పుడు. చివరకి ని శ్శబ్దాన్ని బ్రేక్ చేస్తూ అన్నాను. " మాస్టారూ ! ఇవాళ ఒక గొప్ప విషయం అర్థమయింది. సుధాకర్ ఇంత చిన్న వయసులోనే ఇంత ఉన్నతంగా ఎలా అలోచించగలుగుతున్నాడా అని ఈనాలుగు రోజులుగా ఆశ్చర్యపోతున్నాను. ఇవాళ నాకు సమాధానం దొరికింది. మీలో ఇన్నాళ్ళూ నాకు అల్పత్వమే గోచరించింది. ఇవాళ తెలిసింది మీరెంత ఉన్నతులో. సుధాకర్ మీకొడుకు అందుకనే ఆ కుర్రాడికి అంత సంస్కారం వచ్చింది. తప్పులదేముంది లెండి - రావిశాస్త్రిగారు చెప్పినట్టు - అంతా చేస్తాం . కాని నేను తప్పు చేస్తున్నాననే స్పృహ, నిరంతరం దాని గురించి వేదన , తప్పుని దిద్దుకోలేక పోతున్నావే అనే వేదన - ఇన్ని సంఘర్షణలని భరిస్తున్న మీరు మామూలు వ్యక్తి కాదు. ఔన్నత్యంతో పాటు, లోపాలు కూడా వుండబట్టే కదా మీరు గ్రహణం పట్టినచంద్రుడ్లా అయిపోయారు. మీరు శాపగ్రస్తులయి వుంటారు. లేకపోతే మీరెందుకు ఇంత వేదనకి గురవుతారు. "

"సరే మాస్టారూ, ఫిలాసఫీని కాస్త పక్కకి పెడదాం. నేను అడిగిన సంగతేం చేశారు?"

"అలాగే - తప్పకుండి ప్రయత్నించి సుధాకర్ చదువు మానేయకుండి చూస్తాను. కాని మీరు అంగీకరించే షరతుల్ని బట్టి నేను సుధాకర్‌ని persuade చెయ్యడానికి వీలుపడుతుంది."

"చెప్పండి నేనేమి చేయ్యాలో"

"పెద్ద త్యాగాలేవీ చెయ్యనక్కరలేదు. మీ భార్యా బిడ్డల బాగోగులు కాస్త పట్టించుకోండి. జీతం వచ్చీరాగానే ఇల్లు గడవడానికి అవసరమయ్యే మొత్తం మీ శ్రీమతిగారికి ఇవ్వండి. అప్పులవాళ్ళు ఇంటికొచ్చి పరువు తియ్యకుండ జాగ్రత్త పడండి. అంతే, నా మనవి!"

"మనవి కాదు, నా బాధ్యతని గట్టిగా గుర్తుచేశారు. మీరు చెప్పినట్టే చేస్తాను. సుధాకర్‌తో రేపుమాట్లాడ్డం మరిచిపోకండి" అనేసి వెళ్ళిపోయాడు.

జరిగిందంతా ఓ గమ్మత్తయిన కలలా అనిపిస్తుంటే, మెల్లిగా లేచి రూముకి తాళం బిగించి, బయలుదేరాను. పోర్టికో దగ్గర తవిటయ్య రిక్షా, మేడ మెట్లు దిగుతూ మేథ్స్ హెడ్ కనిపించారు. మళ్ళీ మామూలే నన్న మాట కథ. కుక్కగోతిలో పడుకున్నంత సేపూ నీతులు వల్లె వేసుకుందట. ఎంగిలాకు పడీపడగానే - అన్ని నీతులూ గోవింద. తవిటయ్య రిక్షా కనపడగానే ఇంత సేపూ జరిగిన తతంగం అంతా - ఓ హరికథా కాలక్షేపం.

సరే, అతనితోపాటే మేడ మెట్లు దిగి, అతను రిక్షా ఎక్కుతుండగా చూస్తే అతనికి సిగ్గు ముంచుకురావచ్చును. ఎందుకతన్ని బాధించాలి? అందుకని ఆఫీసు గదిలోకి దూరేసి, కాసేపు అక్కడ కూర్చున్నాను. ఓ పావుగంట తర్వాత బయటికొచ్చి, ఏటి వైపు దారి తీశాను. అక్కడా వుండలేక ఇంటివైపు నడుస్తుంటే, తవిటయ్య రిక్షా ఎదురయింది "ఇంటి దాకా రమ్మంటారా అయ్యా!" అన్నాడు.

"అదేవిటి ఇంత వేగిరం వచ్చేశావు? అయ్యగార్ని క్లబ్బుకి తీస్కెళ్ళలేదా?" అనడిగేను.

"అయ్యగారు ఇవాళ ఇంటికాడ పనుందని, క్లబ్బుకి రానని సెప్పి, నడిసి మరీ ఇంటికెల్లి పోనారయ్యా!" అన్నాడు.

అనుకోకుండా ఏటి వైపు చూశాను ఎందుకో. దూరం నుండి ఏరు నవ్వుతున్నట్టనిపించింది.

వారం రోజుల తర్వాత ఒక ఆదివారం పొద్దున్నే ఎవరో తలుపు తట్టి లేపారు. కళ్ళు నులుపుకుంటూ వెళ్ళి తీశాను. నారాయణ. "సారీ సార్! నిద్ర లేపుతూనే విచారకరమైన వార్త చెపుతున్నాను. మేథ్స్ హెడ్‌గారు చనిపోయారు. సూయిసైడ్ అంటున్నారు."

తూలిపోబోయి, తలుపు పట్టుకుని నిలబడ్డాను. 'ఎలా... ఎలా' అని నోటంట మాట రాక తన్నుకుంటోంది. రెండు నిమిషాలు మౌనంగా నిలబడి "మీరు త్వరగా రండి సార్! స్టాఫ్ అంతా అక్కడికి బయలుదేరారు" అనేసి వెళ్ళిపోయాడు నారాయణ.

వడివడిగా కాలకృత్యాలు పూర్తిచేసి అక్కడికి చేరుకునేసరికి, మొత్తం కాలేజల్లా అక్కడే వున్నారు. ప్రిన్సిపల్ అభిశంసిస్తున్నవాడ్లా నావైపు చూశాడు. అందరూ నన్నే దోషిని చేసి చూస్తున్నట్టు అనిపించింది.

పోలీస్ సర్కిల్స్‌లో తనకున్న పలుకుబడిని వినియోగించి పోస్టుమార్టమ్ తతంగం లేకుండా చేశాడు ప్రిన్సిపల్. పన్నెండయ్యేసరికి వందలాది విద్యార్థులు, తోటి లెక్చరర్లు, స్నేహితులు వెనక నడుస్తుండగా శవయాత్ర కాలేజి దగ్గరి శ్మశానవాటికకి చేరుకుంది. చితికి సుధాకర్ నిప్పంటిస్తుంటే,

తవిటయ్య, బాబులు, క్లబ్బు బంట్రోతులు, క్లాసు ఫోర్ స్టాఫ్‌లో చాలామంది గుండెలు పగిలేలా ఏడ్చారు. అపరాధ భావం నా మనసుని దహించేస్తోంది. చెప్పలేనంత నిస్పృహతో ఇల్లు చేరి, పక్క మీద వాలాను. ఏదో కాగితం వీపుకి తగిలినట్టయి చూస్తే కవరు ఉత్తరం. పోస్ట్‌మేన్ కిటికిలోంచి లోపలికి విసిరేసి వుంటాడు. కవరు విప్పి చూస్తే – మేథ్స్‌హెడ్ గారి దస్తూరి! గుండె దడదడ కొట్టుకుంది – ఏమి రాసేడో?

డియర్ వివేకానంద్!

ఒప్పందం నిలబెట్టుకుంటున్నాను – కాని మీరు ఊహించలేని పద్ధతిలో. నన్ను నేను జయించుకొని, నా కుటుంబాన్ని రక్షించుకోవాలనే ప్రయత్నంలో అన్ని మార్గా లు మూసుకుపోయాయని అనిపించాకనే ఈ ఆఖరి మార్గాన్ని ఎన్నుకున్నాను. మరో ఆరు సంవత్సరాలు నా సర్వీస్ వుంది కనక అంతదాకా పూర్తి పెన్షన్ కుటుంబానికి వస్తుంది. దాంతో ఇబ్బందుల్లేకుండా ఇల్లు గడిచిపోవచ్చు. ఇతర డెత్ కమ్ రిటైర్మెంట్ బెనిఫిట్స్‌తో మా వాళ్ళకి ఓచిన్న ఇల్లు కొనిపెట్టండి.

సుధాకర్‌కి చదువు లేకుండా చేసి, బాధ్యతలు నెత్తి మీద వేస్తున్నాననే వేదన ఈ ఆఖరి క్షణంలో కూడా నన్ను బాధిస్తోంది. ప్రిన్సిపాల్‌గారికి నేనంటే చాలా అభిమానం. అంచేత Deceased Employee's son గా సుధాకర్‌ని కాలేజీలో ఏదో వుద్యోగంలో కుదురుస్తారు – నాకా నమ్మకంవుంది.

సెలవు! Absurd మృత్యువుతో ముగుస్తుందని కదూ మీ Albert Camus అంటాడు? ముగుస్తుందా – ప్రారంభమవుతుందా? మీ సమాధానం వినడానికి నేనుండను కదా! అది మరో Absurd situation !

☆✪☆

(ఆంధ్రజ్యోతి వారపత్రిక 5-4-96)